## గజ్వేల్‌లో ఇఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి

### -మంత్రికి వినతిపత్రం అందజేసిన సందబోయిన ఎల్లయ్య

**గజ్వేల్, నవంబరు 22 (ప్రభాతవార్త):**
గజ్వేల్ నియోజకవర్గంలో ఈఎస్ఐ ఆసుపత్రితో పాటు కార్యాలయం ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య శనివారం జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ జిల్లాలో సుమారు 200లకు పైగా పరిశ్రమలకు ఉన్నాయని, 50వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు.
అంతేకాకుండా మున్సిపల్, ప్రైవేట్ సంస్థలలో పనిచేసే కార్మికులు అంతా ఈఎస్ఐ పరిధిలో ఉన్నారని, ప్రతినెలా కార్మికుల జీతాల నుండి ఈఎస్ఐ కార్పొరేషన్‌కు లక్షల రూపాయలు జమ అవుతున్నాయని, కార్మికుల ప్రయోజనం కోసం ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట సిఐటియు నాయకులు ఐలయ్య, రాజు, శివయ్య, సురేష్ తదితరులు ఉన్నారు.




## హత్నూర మండలంలో సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు!

**హత్నూర నవంబరు 22, ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జారీ చేసి జీవో ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా సర్పంచ్ వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసే ప్రక్రియలో శనివారం అధికారులు నిమగ్నమయ్యారు. సంగారెడ్డి జడ్పీ కార్యాలయంలో మండలాల వారిగా రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టారు. అనధికారికంగా అందిన సమాచారం ప్రకారం.. హత్నూర మండలంలోని సర్పంచుల రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి. కొన్యాల, పన్యాల, నాగారం, కోడిపాక, చందాపూర్, కాసాల, మల్కాపూర్, వడ్డేపల్లి, కోనంపేట్ గ్రామపంచాయతీలు బీసీలకు రిజర్వేషన్ కాగా, ఎస్సీ జనరల్... గుండ్ల మాచనూర్, దేవులపల్లి, రెడ్డి ఖానాపూర్, ఎస్సీ మహిళ.. చింతల చెరువు, హత్నూర, సికిందలాపూర్, నస్తిపూర్. జనరల్.. కోడిపాక, కొత్తగూడెం, చీకుమద్దూర్, మంగాపూర్, నాగోల్దేవులపల్లి, ఎల్లమ్మగూడెం, బ్రాహ్మణగూడెం, దౌల్తాబాద్, సాదుల్నగర్, షేరఖాన్ పల్లి, తుర్కలఖానాపూర్, ముచర్ల, లింగాపూర్, మధుర, పల్పనూరు, రొయ్యపల్లి, సిరిపురం, గోవింద్రాజ్ పల్లి గ్రామాలు ఉన్నాయి. ఎస్టీ జనరల్.. దేవుని గుట్ట తండా, తెల్ల రాళ్ల తండా, ఎస్టీ మహిళ లగ్మా తాండ, నవాపేట. గజిట్ నోటిఫికేషన్ అనంతరం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.


సింగూరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

## సింగూరు డ్యాం పునరుద్దరణకు రూ. 16 కోట్లు

### -ప్రాజెక్టును పరిశీలించిన అధికార బృందాలు

### -డిసెంబర్‌లో ప్రారంభించి జూన్ లోగా పనుల పూర్తి

**పుల్‌కల్, నవంబరు 22, ప్రభాతవార్త:** వచ్చే జూన్‌లోగా సింగూరు ప్రాజెక్టు ఆనకట్ట పనులను పునరుద్దరిస్తామని, అందుకు 16 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్ తెలిపారు. మిషన్ భగీరథి ఎస్‌సి కృపాకర్‌రెడ్డి, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్బీ టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, సీజీఎం బ్రిజేష్‌లతో కూడిన సాంకేతిక కమిటి బృందం సభ్యులతో అంజద్ హుస్సేన్ ప్రాజెక్టును పరిశీలించి మాట్లాడుతూ ఆనకట్ట లోపలి భాగంలో దాదాపుగా 8వందల మీటర్ల వరకు రివిట్మెంట్ కుంగి పోయిందన్నారు. 6.5 కిలో మీటర్ల దూరం వరకు ఆనకట్ట దెబ్బతిందన్నారు. కుంగిపోయిన రిట్మెంట్‌ను తొలగించి అట్టడుగు స్థాయి నుంచి ఆనట్టను పటిష్టం చేస్తామన్నారు. ఆనకట్ట బాగులేదని జాతీయ రాష్ట్ర ఆనకట్ట భద్రత కమిటీలు ఇచ్చిన నివేదిక ఆధారంగానే ముందుకు పోతున్నామన్నారు. 29.917 టీఎంసిల పూర్తి స్థాయి నీటి నిల్వలకు ప్రస్తతం 17టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయన్నారు. పనులు చేపడుతున్న తరుణంలో నిల్వ నీరు అడ్డుగా వస్తే 7 టీఎంసిలనీటిని దిగువకు వదలేసి పనులు చేపడతామన్నారు. పునరుద్దరణ పనులు సకాలంలో పూర్తి కాకుంటే మరో సీజన్‌లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆనకట్ట పటిష్టతకు ప్రభుత్వం 16 కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ అనుమతి రాగానే డిసెంబరు నెలలో పనులను మొదలు పెడతామన్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ పోచమల్లు, ఈఈ భీమ్, డిఈఈ నాగరాజు, ఏఈఈలు జగన్నాథ్, శాలిని, నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఫోటో ఆర్ఎంపిటి 5 ః మాట్లాడుతున్న సొసైటీ డైరెక్టర్లు లద్ద నిర్మల దంపతులు, పోచమ్మల ఐలయ్య

## చెరుకు రైతులకు రూ.500 బోనస్ అందేలా చూడండి

### -మంత్రి శ్రీధర్‌బాబుకు సిడిసి చైర్మన్ ముబీన్ వినతి


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందచేస్తున్న సిడిసి చైర్మన్ మోబిన్

**జహీరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** చెరుకు రైతులకు గిట్టుబాటు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందేలా అందించేలా చర్యలు తీసుకోవాలని వినతి చేస్తూ శనివారం సిడిసి చైర్మన్ మహ్మద్ అబ్దుల్ ముబీన్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, సెట్విన్ కార్పోరేషన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి, టిజి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డిలతో కలిసి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు హైదరాబాద్‌లోని సెక్రెటేరియట్‌లో మంత్రి చాంబర్‌లో వినతి పత్రం అందచేశారు. వినతి పత్రం అందుకున్న మంత్రి శ్రీధర్‌బాబు రైతుల సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం చెరుకు రైతులకు గిట్టుబాటు ధర, బోనస్‌లు అందేలా తన వంతు కృషి చేస్తానని హామి చేసినట్లు సిడిసి చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిడిసి డైరెక్టర్లు పాల్గొన్నారు.

## చేపల పెంపకం ఉపాధికి మార్గం

### మంత్రి వివేక్‌వెంకటస్వామి

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), నవంబర్ 22, ప్రభాతవార్త :** గ్రామ అభివృద్ధి, ప్రజల అభ్యున్నతి దిశగా కాంగ్రెస్ ముందడుగు వేస్తుందని మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. శనివారం అక్బర్‌పేట భూంపల్లి మండలం పరిధిలోని చిట్టాపూర్ గ్రామంలో పెద్ద చెరువులో ఉచిత చేప పిల్లలను జిల్లా కలెక్టర్ హైమావతితో కలసి చెరువులో వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేపల పెంపకం గ్రామీణ ప్రజలకు ముఖ్యమైన ఉపాధి మార్గమని, ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం రైతులకు, మత్స్యకారులకు ఎంతో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో సామాన్య ప్రజలకు కూడా ఉన్నత అభివృద్ధి సాధిస్తారు. కాంగ్రెస్ పాలనలో బడుగు బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

**దుబ్బాకలో...**
దుబ్బాకలో మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి అని ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. శనివారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఐఓసి భవనంలో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.. మహిళలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజారి హరికృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ గాంధా నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మద్దుల సోమేశ్వర్ రెడ్డి, మద్దుల గాలి రెడ్డి, సోలిపేట దుర్గ ప్రసాద్ రెడ్డి, పాతూరు వెంకటస్వామి గౌడ్, కొంగరి రవి, యేసు రెడ్డి, ఏలూరి కమలాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి బాల నరసింహులు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సందీప్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంతూరి బాబు, ఫిషర్ మేన్ అధ్యక్షుడు జంగి బిక్షపతి, ఆర్డిఓ సదానందం, జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, గ్రామ కమిటీ మహిళా అధ్యక్షురాలు నగరం లక్ష్మీ ్మ నరసవ్వ, ముదిరాజ్ సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


చెరువులో చేప పిల్లలను వదులుతున్న మంత్రి

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

### జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

**గజ్వేల్, నవంబరు 22 (ప్రభాతవార్త):**
మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత చేసినా తక్కువేనని, మహిళ సాధికారతే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమలు, గనులు, భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం తెలంగాణ ప్రభుత్వం మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ పట్టణంలోని ఐఓసి కార్యాలయంలో నియోజకవర్గంలోని మహిళా గ్రూపు సభ్యులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ గీతాలాపన సమయంలో చాలా మంది మహిళలు గేయాన్ని ఆలపించడం నేను చూశానని, రాష్ట్ర గీతానికిఉన్న ప్రాముఖ్యతను తెలియజేశారు. ముఖ్యమంత్రి మహిళా అభ్యున్నతికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని, మహిళలు అన్ని రంగాలలో బలోపేతం చేయడానికి మహిళా శక్తిని పెంచడానికి వారే సొంతంగా ఆదాయం సంపాదించడం కోసం, కుటుంబాన్ని పోషించడం కోసం అనేక పథకాలను చేపట్టారన్నారు. పాఠశాల యూనిఫాం, రూ.22 కోట్ల వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ 600 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం సుమారు రూ.8వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం చాలా మంది మహిళలు ఉపయోగించుకోవడం సంతోషమన్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కోసం రూ.12వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు ఇష్టమైన రంగులతో చీరలను మన రాష్ట్రంలోని సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో చేనేత కార్మికులు తయారుచేసిన చీరలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉదయం గజ్వేల్‌లో చీరల పంపిణీకి వెళ్తున్నట్లు తన సతీమణికి తెలుపగా నాకు సైతం చీర కావాలని అడిగిందంటే అర్థం చేసుకోవాలన్నారు. మహిళలకు మంచి నాణ్యత కలిగిన చీరలను అందజేస్తున్నట్లు గుర్తించాలన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ వారి పేరుపై గజ్వేల్ నియోజకవర్గంలో ఒక లక్షా 94,664 చీరలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాలకే కాకుండా తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్క మహిళకు చీరలను అందజేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌కు శ్రీరామరక్ష అన్నారు. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లాలోనే 11వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 9వేల ఇళ్ల నిర్మాణంలో బేస్‌మెంట్ వరకు పూర్తి కాగా రూ.లక్ష వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మిగతా లబ్ధిదారులు సైతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్‌ఆర్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు వంటేరు నరేందర్‌రెడ్డి, విజయ మోహన్, ఆర్డీవో చంద్రకళ, వివిధశాఖల అధికారులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీలో పేర్లు ఎందుకు తొలగించారు...?

### అన్యాయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం...

### రామాయంపేట సొసైటీ డైరెక్టర్లు ఐలయ్య, నిర్మల

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 22, ప్రభాతవార్త**
కాలపరిమితి పొడగించిన సొసైటీ పాలకవర్గం లిస్టులో తమ పేర్లు తొలగించబడటం పట్ల రామాయంపేట సొసైటీ డైరెక్టర్లు పోచమ్మల ఐలయ్య, లద్ద నిర్మల తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం మీడియాతో వారు మాట్లాడుతూ గత నెలలో సొసైటీల గడువు పొడిగింపు సమయంలో రామాయంపేట సొసైటీ పాలకవర్గ సభ్యుల జాబితాలో తమ పేర్లు కనిపించలేదని తెలిపారు. దీనితో సొసైటీ చైర్మన్ బాదే చంద్రం హైకోర్టును ఆశ్రయించగా, వచ్చిన స్టే ఆదేశాల అనంతరం మొత్తం ఎనిమిది మంది డైరెక్టర్లలో చైర్మెన్‌తో పాటు మరో ఐదుగురి పేర్లు ఉండగా, తమ ఇద్దరి పేర్లను మాత్రమే ఎందుకు తొలగించారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. స్టే కొనసాగుతున్నప్పటికీ పాలకవర్గాన్ని యథావిధిగా కొనసాగిస్తూ, సొసైటీ వ్యవహారాలపై విచారణ కోసం ప్రత్యేక అధికారిని కూడా నియమించడం జరిగిందని చెప్పారు. తమపై జరిగిన ఈ అన్యాయాన్ని వెంటనే సరిచేసి, న్యాయం చేయాలని కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తున్నామని వారు తెలియజేశారు. సంఘంలో బాకీ ఉన్న కొందరి డైరెక్టర్లను కొనసాగించారని, మేము ఎలాంటి బాకీ లేమన్నారు. అయినప్పటికీ తమ పేర్లు ఎందుకు తొలగించారో చెప్పాలని అన్నారు.
సొసైటీలో సభ్యత్వం కొనసాగించడంలో ఎలాంటి లోపం తమవల్ల జరగలేదని, ఆధారాలతో సహా వినతిని కలెక్టర్‌కు సమర్పించబోతున్నట్లు వారు తెలిపారు. తమ పేర్ల తొలగింపులో జరిగిన అక్రమాలను విచారించి, హక్కులను పునరుద్దరించాలని వేడుకుంటున్నట్లు ఇద్దరు డైరెక్టర్లు స్పష్టం చేశారు. రామాయంపేట పాలకవర్గం మొత్తం 8 మంది సభ్యులు ఉండగా, పాలకవర్గాన్ని పొడగించాలని స్టే కోసం కోర్టుకు సమర్పించిన లిస్టులో మొత్తం ఎనిమిదిమంది పేర్లు డీసీవో పంపలేదా....? లేక అన్ని పేర్లు పంపినా, ఆరుగురినే ప్రభుత్వం ప్రకటించిందా....? అనే విషయంపై తమకు డీసీవో కూడా వివరణ ఇవ్వాలని కోరారు.


డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను కలుసుకున్న మాల మహానాడు నేతలు

## మంత్రుల దృష్టికి ప్రగతి ధర్మారం గ్రామ సమస్యలు

**రామాయంపేట, నవంబరు 22, ప్రభాతవార్త**
ఉప ముఖ్యమంత్రి డాక్టర్ మల్లు బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రివర్యులు, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామ పంచాయతీలో ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా మాల మహానాడు అధ్యక్షులు మాసాయిపేట మల్లేశం, సంఘ సభ్యులు బైరం సిద్ధిరాములు, ఎల్లం, పెంటయ్య, దుర్గయ్య, ప్రశాంత్ తదితరులు శనివారం నాడు వారిని కలిసి సమస్యలు తెలిపారు. ప్రగతి ధర్మారం ప్రాంతం లోని కొన్ని అభివృద్ధి పనుల విషయమై వారి నివాసములలో మర్యాదపూర్వకంగా కలిసి వివరించడం జరిగిందన్నారు. ప్రగతి ధర్మారం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ చుట్టూ సోలార్ ఫెన్సింగ్, రామాయంపేట మండల కేంద్రంలోని ఎమ్మార్వో ఆఫీసు అసంపూర్తి నిర్మాణ విషయమై, ప్రభుత్వ ఐ బి గెస్ట్ హౌస్ విషయమై మరియు ఎమ్మార్వో ఆఫీస్ కి ఎదురుగా ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ రిపేర్ విషయమై , మెదక్ జిల్లా కేంద్రంలో మన భారత రాజ్యాంగ నిర్మాత డా. భీమ్రావు అంబేద్కర్ గారి భవన నిర్మాణ విషయమై వివరించడం జరిగింది. వారు వెంటనే స్పందించి కలెక్టర్ తో మాట్లాడి లెటర్ కూడా పెట్టడం జరిగింది.

# మహిళలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

### మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి



మహిళలకు చీరెలను పంపిణీ చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**నర్సాపూర్, నవంబరు 22, ప్రభాతవార్త**
మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో ఇందిరమ్మ చీరలు, కళ్యాణ లక్ష్మి ్మ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరు కాగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ సుహాసిని‌రెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయి 8 మండలాల మహిళలకు ఇందిరమ్మ చీరలను కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ మహిళలకు అన్ని విధాల సంక్షేమ పథకాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 12 వేల కోట్లతో సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. అంతేగాక ఇందిరమ్మ ఇండ్ల కోసం 450 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. ఇందులో ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు 53 కోట్ల నిధులు చెల్లించడం జరిగిందన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను 21 కోట్ల రూపాయలను మంజూరు చేసింది అన్నారు. అలాగే 500 కోట్లు బ్యాంకు లింకేజీ కేటాయించిందని గుర్తు చేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మహిళలకోసం స్కిమ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. 80 వేల కోట్లతో ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు కల్పించామని తెలిపారు. అంతేగాక కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆరు గ్యారెంటీల హామీలో 200 యూనిట్ల ఉచిత కరెంటు కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది అన్నారు. మహిళలకు రేషన్ కార్డు ద్వారా ప్రభుత్వ అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన ప్రతి ఒక్కరు ఇండ్లను నిర్మించుకోవాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. ఒకవేళ నిర్మించుకోనివారికి అధికారులు సహాయ సహకారాలు అందించి ఇండ్లు నిర్మించుకునే విధంగా చూడాలని అధికారులకు సూచించారు అనంతరం మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకొని నర్సాపూర్ రాయరావు చెరువులో అధికారులతో కలిసి మంత్రి వివేక్ వెంకటస్వామి చేప పిల్లలను వదిలారు.

**కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలి**

**ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్**

నర్సాపూర్‌లో చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ చీరలను మహిళా గ్రూపు సభ్యులకే కాకుండా రేషన్ కార్డు కలిగి ఉన్న మహిళలందరికీ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అంతేగాక కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చిన నేపథ్యంలో కళ్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం మహిళలకు అందించాలని ఆమె మంత్రికి విన్నవించారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని తండాలలో రోడ్లకు మంజూరైన నిధులు మరిలి పోగా తిరగి అట్టి నిదులను మళ్లీ మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఏదిఏమైనా బతకమ్మ పండుగకు చీరలు పంపిణీ చెయ్యక పోయినా ప్రస్తుతం ఇందిరమ్మ చీరలను ప్రభుత్వం పంపిణీ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మైపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మధులత, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, మాజీ ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, హరీష్ వర్ధన్, టిఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, షేక్ హుస్సేన్, శ్రీకాంత్‌రెడ్డి, రింగుల ప్రసాద్, జ్ఞానేశ్వర్ గుప్తా, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల మహిళలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


అదనపు ఎస్పీ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

## సేవాభావం కలిగి ఉండాలి : అదనపు ఎస్పీ మహేందర్

**పాపన్నపేట, నవంబర్ 22, ప్రభాతవార్త :** ఉన్నత స్థాయికి ఎదిగినా సేవా భావం కలిగి ఉండాలని అదనపు ఎస్పీ మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం మల్లంపేట లో జరిగేజాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ శిబిరానికి ముందు, శిబిరం తర్వాత మీలోని ప్రవర్తన మారిందని. ఎంత ఉన్నత శిఖరాలకు కె వెళ్ళినా సేవా భావ లక్షణం కలిగినప్పుడే జీవితంలో తృప్తి పొందగలమన్నారు. కళాశాల లో ఏర్పాటు చేసే క్యాంపు వాలంటీర్ల యొక్కపరివర్తనను, క్రమశిక్షణను, అంకిత భావాన్ని పెంపొందింపజేస్తాయని అన్నారు.

### ప్రారంభం కంటే గొప్ప ముగింపు ముఖ్యం

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి**

శిబిరాల నిర్వహణతో విద్యార్థుల కు సేవా భావం తో విద్యార్థులకు మంచి పరివర్తన, క్రమశిక్షణ అలవరుచుకోవాలన్నారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న శిబిరం ఎన్నో అంశాలు నేర్చుకుని వాటిని అమలు పరిచినప్పుడే సార్థకత అవుతుందని సూచించారు. క్యాంపు ప్రారంభం నుండే వాలంటీర్లు గ్రామ సర్వే, శ్రమదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరం, అనేక అవగాహన కార్యకలాపాల ద్వారా ఈ క్యాంపును అద్భుతంగా ముగించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలు మీ భవిష్యత్తులో ఉపయోగపడతాయన్నారు. అనంతరం సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూమా గ్రామంలో మార్పుకు నాంది పలికారని ఈ వారం రోజుల పాటు మీరు చేసిన కార్యక్రమాల ద్వారా మా ప్రజలను పరిశుభ్రత వైపు, విజ్ఞానం వైపు, ఆరోగ్యం వైపు ఆలోచింపజేసారు. మూఢనమ్మకాలను విడనాడారు. మీ ఈ సేవకు గానూ మా గ్రామాన్ని ఎంచుకున్నందుకు మీ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు అందరికీ ఏఎస్పీ, డిఐఈఓ లు సర్టిఫికెట్‌లు అందజేశారు అని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జూలకంటి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు, అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌లను రద్దు చేయాలి

### -నోటిఫికేషన్ పత్రం దగ్దం-నిరసన ప్రదర్శన

**జహీరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** కార్మిక వ్యతరేక 4లేబర్‌కోడ్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సిఐటియు ఆధ్వర్యంలో సిఐటియు మహీంద్రా టెక్నిషన్ కాలనీ నుంచి చెక్ పోస్టు వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన ప్రదర్శన చేసి నోటిఫికేషన్ పత్రాన్ని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్ మహిపాల్ మాట్లాడుతూ బీహార్‌లో ఎన్‌డిఏ కూటమికి అత్యధిక మెజారిటీ రావడంతో కేంద్రంలో కార్పోరేట్ నుకూల విధానాల అమలు వేగవంతం చేయడంలో భాగంగా కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను అమల్లోకి తెస్తూ శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు నష్టం కల్గించే లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు వివిధ పరిశ్రమల యూనియన్ నాయకులు నరేష్, మహేశ్వర్, సందీప్‌రెడ్డి, శివరామరావు, బాల్‌రాజ్, భార్గవ్, సాయి కిరణ్‌గౌడ్, శ్రీకాంత్, ఉమా, ఎల్లప్ప, సంజీవ్, గుండప్ప తదితరులు పాల్గొన్నారు.



లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన తలుపుతున్న సిపిఎం నాయకులు

## షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**జహీరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండల పరిధిలోని ధనసిరి గ్రామంలో విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన కామిరెడ్డి, సరోజా రాఘుల్‌రెడ్డిలకు చెందిన ఇండ్లు కాలిపోయాయి. షాట్ సర్క్యూట్‌తో ఇండ్లు కాలిపోయినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గ్రామానికి చేరుకుని కాలిపోయిన ఇండ్లను పరిశీలించి బాధితులను పరామర్శించారు. బాధితులకు నష్టపరిహారం అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే బాధితులకు భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

## బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

### 36 లీటర్ల మద్యం స్వాధీనం

**అక్కన్నపేట, నవంబరు 23, ప్రభాతవార్త :** మండలంలోని గౌరవెల్లి, జనగాం గ్రామాల్లో బెల్ట్ షాపులపై ఎస్ఐ ప్రశాంత్ తమ సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న బండి సరోజన, బెక్కంటి రాజు, బానోతు సంపత్, గుడికందుల నరేష్‌ల దుఖానాల నుండి 36 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. మండలంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


స్వాదీనం చేసుకున్న మద్యం చూపిస్తున్న ఎస్ఐ ప్రశాంత్

## సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి : ఇన్‌స్పెక్టర్



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కరపత్రాన్ని చూపిస్తున్న దృశ్యం

**సంజీవరెడ్డి నగర్, నవంబర్ 22 ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని రీసునాస్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్.ఆర్.నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్.నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు రథోడ్, కళాశాల యాజమాన్యం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణం వద్దంటూ కొవ్వొత్తుల ప్రదర్శన



మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయవద్దంటూ కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న హార్మోని అవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు.

**బేగంపేట నవంబరు 22,ప్రభాతవార్త**

జనావాసా ప్రాంతాల్లో మద్యం దుకణాలను ఏర్పాటు చేయవద్దంటూ బేగంపేటలో హార్మోని అవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తుల ప్రదర్శన చేసారు.బేగంపేట గురుమూర్తి కాలనీ సమీపంలో గత నాలుగు సంవత్సరాలుగా మద్యం దుకణం నడుస్తుండటంతో కాలనీ వాసులు,విద్యార్థులు,మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.ఇటీవల మద్యం టెండర్లు పూర్తవగా వచ్చే నెల నుంచి కొత్త దుకాణాలు ప్రారంభం కానున్న తరుణంలో కాలనీ సమీపంలో ఉన్న మద్యం దుకాణాన్ని తరలించాలని డిమాండ్ చేసారు.రాత్రి వేళల్లో మద్యం సేవించిన మందుబాబులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని,కాలనీలోకి రావాలంటే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నామన్నారు.ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసికెళ్లినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆగ్రహం వ్యక్తం చేసారు.తమకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని,మద్యం దుకాణాన్ని మాత్రం మరో చోటుకి తరలించేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని హార్మోని అవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీవాసులు పార్వతి,రాశిలు హెచ్చరించారు.

## 42శాతం రిజర్వేషన్ సాధించేవరకు పోరాటం చేయాలి : దేశబోయిన రఘు



దేశబోయిన రఘుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

**సికింద్రాబాద్. నవంబర్ 22 ప్రభాతవార్తః** బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42శాతం రిజర్వేషన్ సాధించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని బీసీ జాయింగ్ యాక్షన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ కన్వీనర్, హైకోర్టు ప్రముఖ న్యాయవాది డాక్టర్ దేశబోయిన రఘు తెలిపారు. బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ దేశబోయిన రఘును రాష్ట్ర కన్వీనర్‌గా నియమిస్తు పత్రాన్ని రఘుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో బీసీలు వెనుకబడి ఉన్నారని, బీసీలను పల్లకీల మోసే వారిగానే అగ్రవర్ణాలు గుర్తిస్తున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితులు మారాలంటే పోరాటం చేయక తప్పదని అన్నారు. ఇందుకోసం అందరిని కలుపుకుని పోరాటం మరింత ఉధ్రుతం చేస్తానని చెప్పారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



హిమాయత్ సాగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న కాంటెస్టెడ్ కార్పోరేటర్ రాజు.

**నార్సింగి, నవంబర్ 22 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని హిమాత్ సాగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కాంటెస్టెడ్ కార్పోరేటర్ చేగూరి రాజు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. శనివారం గూంజ్ సంస్థ సహకారంతో 200.మంది విద్యార్థులకు స్కూల్ బాగ్స్, స్టేషనరీ, వాటర్ బాటిల్స్, టాయ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సమాజంలో ఆర్థికంగా స్థిరపడ్డ వాళ్లు, దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థుల చదువులకు చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. చాలా మంది పిల్లలకు చదువుకోవాలన్న ఆశ ఉన్న వారి కుటుంబ పరిస్థితుల కారణంగా మధ్యలోనే చదువులు మానేసి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మానవతా దృక్పథంతో మనం చేసే చిన్న సహాయం పేద విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా మారుతుందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు కార్పోరేట్ సంస్థలకు ధీటుగా నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాజు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకగణం, గూంజ్ సంస్థ ప్రతినిధులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవదాయ శాఖ కమిషనర్ హరిశ్‌ను కలిసిన బల్కంపేట ఎల్లమ్మ ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్



అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించిన దృశ్యం

**సంజీవరెడ్డి నగర్,నవంబర్ 22 ప్రభాతవార్త:** బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ సాయిబాబా గౌడ్, నూతన పాలక మండలి సభ్యులు ఎం.నవీన్ రాజ్, కె.రవి, సత్య నారాయణ, శ్రీధర్, మహేశ్‌లతో కలిసి దేవదాయ శాఖ కమిషనర్ హరిశ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఆలయ అభివృద్ధి పనుల గురించి చర్చించి అమ్మవారి దర్శించుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ హరిశ్ తప్పకుండా వస్తానని,అమ్మవారి ఆలయానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల గురించి స్వయంగా వచ్చి తెలుసుకుంటానన్నారు.

# విద్యుత్ బిసి ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

-పూలే విగ్రహాల దిమ్మెలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
-బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్.కృష్ణయ్య డిమాండ్




మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, వెంకన్నగౌడ్,కుమారస్వామి, యాదగిరి తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 22,ప్రభాతవార్త:** హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం 2014 నుంచి ఇచ్చిన పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో విద్యుత్ బిసి భవన్లో తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కోడెపాక కూమరస్వామి, ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్‌ల ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని సూచించినా యాజమాన్యం వాటిని పట్టించుకోవడం లేదని ఆర్టిజన్లకు అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలన్నారు. విద్యుత్సంస్థల్లో డైరెక్టర్ పోస్టుల్లోనూ బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే బిసి భవన్ స్థలం కొంతమంది ఆక్రమిస్తున్నారని, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఈ సమస్య పరిష్కరించాలన్నారు. పూలే, సావిత్రిబాయి విగ్రహాలు దిమ్మెను ధ్వంసం చేసినా పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. అసోషియేషన్ల మధ్య గొడవలు లేకుండా సమస్యను యాజమాన్యం పరిష్కరించాలన్నారు. విద్యుత్ బీసీ భవనానికి ఎదురుగా ఉన్న మహనీయులు మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రాహాలు తొలగించే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి "కుమార స్వామి, ముత్యం వెంకన్నగౌడ్‌లు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలకు ఐఏఎస్ అధికారులు వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తారనుకుంటే అది కావడం లేదని హక్కులు కాలరాస్తే చూస్తు ఉరుకునే పరిస్థితి లేదన్నారు. విద్యుత్ సంస్థల్లో ఏప్రిల్ 2026 నుంచి రావాల్సిన వేతన సవరణ కోసం కమిటీని నియమించి ఉద్యోగుల డీఏను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు పి.యాదగిరి, కార్యదర్శి మురళీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, నరేష్, వెంకటేష్, సిద్దిలింగం, రవీందర్, గోవర్ధన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# బూల్కాపూర్ నాలాను కాపాడాలని బిఆర్ఎస్ ఆందోళన



బూల్కాపూర్ నాలాను కాపాడాలంటూ మణికొండలో ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

- కబ్జాల నుంచి వరద నాలాను కాపాడాలని డిమాండ్

**నార్సింగి, నవంబర్ 22 ప్రభాతవార్త :** వరద నీటిని సులువుగా మూసీనదిలోకి మోసుకెళ్లే చారిత్రక బూల్కాపూర్ నాలాను కాపాడాలని డిమాండ్ చేస్తూ మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. శనివారం బిఆర్ఎస్ నాయకులు మణికొండలో "కాపాడుకుందాం కాపాడుకుందాం బూల్కాపూర్ నాలాను కాపాడుకుందాం-బూల్కాపూర్ నాలపై ఆక్రమణలను అడ్డుకుందాం" అంటూ ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ శతాబ్దకాలంగా శంకర్‌పల్లి-జన్వాడ-గోపాలపురం-మణికొండల మీదుగా మూసీ నది వరకు 22.కిలోమీటర్ల దూరం విస్తరించి ఉన్న బూల్కాపూర్ నాలాను ఇటీవల మణికొండలో పెద్ద ఎత్తున కబ్జాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నాలాను కబ్జాలు చేసి హైరేంజ్ అపార్టుమెంట్లు కడుతున్నా మున్సిపల్, రెవెన్యూ అధికారులు గాని, ఇరిగేషన్ అధికారులుగాని పట్టించుకోవడం లేదన్నారు. దీంతో వర్షాకాలంలో వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లకుండా పక్కనే ఉన్న ఇళ్లు, అపార్టుమెంట్లను ముంచెత్తుతుందన్నారు. పందెన్‌వాగు, బూల్కాపూర్ నాలా ఇలా కనిపించిన ప్రతీ స్థలంను కబ్జా చేస్తుంటే కాపాడాల్సిన అధికారగణం కళ్లప్పగించి చూస్తుండడం దారుణమన్నారు. ప్రతీ వర్షాకాలంలో పంచవటి కాలనీ, పాత మణికొండ గ్రామం, సెక్రెటేరియట్ కాలనీ, అల్కాపూర్, నెక్‌నాంపూర్ ప్రాంతాలలోని ఇళ్లన్నీ వరద నీటితో నిండి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వెంటనే అధికారగణం స్పందించి బూల్కాపూర్ నాలాను కబ్జాల చెర నుంచి విడిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కుంభగల్ల ధన్‌రాజ్, గుట్టమీది నరేందర్, బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి, అందె లక్ష్మణ్‌రావ్, యాలాల కిరణ్, భాను చందర్, మహ్మద్ ఆరిఫ్, సుమనళిని, బొడ్డు శ్రీధర్, బిందు, రేఖ, సముద్రాల రమేష్, షకీలరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో విద్యలో వచ్చిన మార్పుల కారణంగా పెరిగిన ఉద్యోగావకాశాలు



పాల్గొన్న ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్, ప్రొఫెసర్ పండురంగ రెడ్డి తదితరులు

**చిక్కడపల్లి నవంబర్ 22 (ప్రభాతవార్త) :** దేశంలో ఉన్నత విద్యలో వచ్చిన మార్పులు కారణంగా పరిశోధన, ఉద్యోగావకాశాలలో మురుగయ్యాయని శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఉ. ఉమేష్ కుమార్ అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళాభావన్ లో అరోరా డిగ్రీ, పీజీ కళాశాల 29వ మినీ స్నాతకోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఉ. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ-పట్టణ విద్యార్థులకు ఉన్న పెరుగుతున్న అవకాశాలపై మాట్లాడారు."విద్యార్థులు ధైర్యంగా ముందుకు వెళ్లాలి; విఫలమయ్యే భయం లేకుండా ప్రయత్నించడం విజయం సాధించే ముఖ్యమైన మెట్టు అని ఆయన అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ ఐ. పండురంగ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను నిరంతరం మెరుగుపరుచుకోవాలని, ప్రస్తుత కాలంలో నైపుణ్యాలు, అభిరుచులు, క్రమశిక్షణ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని సూచించారు. కాన్వొకేషన్ అనేది ఒక ముగింపు కాదు, కొత్త ప్రయాణానికి ఆరంభం అని స్పష్టం చేశారు. సిసిఎంబి పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ మోహన్ రావు మాట్లాడుతూ భవిష్యత్తును విశ్లేషిస్తూ బయోలాజికల్ రీసెర్చ్ ప్రభావం, భారత శాస్త్రవేత్తల ప్రపంచ స్థాయి నిలువుతాయని, యువతలో పరిశోధనాప్రవృత్తి పెంపుపై ప్రసంగించారు. ప్రో ఆర్చ్ సొల్యూషన్ డైరెక్టర్ గ్లోబల్ టాలెంట్ అక్విజిషన్ హెడ్ డి. సారిత, అరోరా విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ నిమ్మటూరి రమేష్ బాబు, చైర్మన్ నిమ్మటూరి అనుదీప్, ప్రిన్సిపాల్ డా. ఎం.సి. అజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శి నిమ్మటూరి ప్రభుద్యుత్ తదితరులు పాల్గొనగా వైస్ ప్రిన్సిపాల్ జి. సాయి , డా. మీరా జోషి, డా. కె. పద్మజ, వీనా కపూర్ తదితరులు పాల్గొన్నారు.

# బసవతారకంలో ఆర్థోపెడిక్ అంకాలజీపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్యనిపుణులు

**హైదరాబాద్, నవంబర్ 22,ప్రభాతవార్త:** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ లో శనివారం ఆర్థోపెడిక్ అంకాలజీ లో ఆధునిక వైద్యం పై ప్రత్యేక వర్క్ నిర్వహించారు. బోన్ 2025 పేరుతో ఎముక మరియు మృదు కణజాల కణితుల నిర్వహణలో క్లినికల్ నైపుణ్యాలు జ్ఞానాన్ని పెంపొందించడానికి, ఎముకలకు సంబంధించిన క్యాన్సర్ల పై నిపుణులైన ఆర్థో ఆంకాలజీ శస్త్ర చికిత్స నిపుణులు వివరించారు. ఈకార్యక్రమానికి ఆసుపత్రి సిఈవో కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎముకలకు వచ్చే క్యాన్సర్లకు నిపుణులైన వైద్యులు చికిత్స అందిస్తే వచ్చే ఫలితాలు వేరుగా ఉంటాయనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. గతంలోలా కాకుండా అన్ని రుగ్మతలకు తాము చికిత్స ఇవ్వగలమనే భావన కన్నా కొన్ని ప్రత్యేకమైన వ్యాధులకు అందులో నైపుణ్యం సాధించిన వారి ద్వారా ఇవ్వగలిగితే మంచి ఫలితాలు రాబట్టవచ్చని సూచించారు. ఆంకాలజీ విభాగంలో బసవతారకం వైద్య బృందం సాధించిన నైపుణ్యాన్ని, అనుభవాన్ని పంచడానికి ఎల్లవేలలా సిద్ధంగా ఉంటామని ఇందులో భాగంగానే ఈ వర్క్ షాపు నిర్వహించామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశం నలుమూల నుండి వచ్చిన ప్రముఖ ఆర్థో ఆంకాలజీ నిపుణులైన డాక్టర్ ఆశిష్ గులియా, డాక్టర్ రుద్ర ప్రతాప్ సింగ్, డాక్టర్ తడల ఎస్ ఎస్ హర్ష, డాక్టర్ రాజీవ్ రెడ్డి, డాక్టర్ హిమాకాంత్ ఎల్, డాక్టర్ అశ్విన్ ప్రజాపతిలు పలు కీలకాంశాలపై ప్రసంగించారు.

# రాష్ట్రంలో సహాయక బృందాల తరహాలో కిషోర బాలికల బృందాలు

-తెలంగాణ సంస్కృతి సారధి చైర్పర్సన్ గుమ్మడి వెన్నెల



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ సంస్కృతి సారధి చైర్పర్సన్ గుమ్మడి వెన్నెల, శాంతా సిన్హా తదితరులు

**చిక్కడపల్లి నవంబర్ 22 (ప్రభాతవార్త) :** సమాజంలో బాలికల పట్ల వివక్షతలు ఇక ఏ మాత్రం సహించేది లేదని, సమానత్వ సాధనకై పోరాడదాం అని తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య పిలుపునిచ్చింది. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య (టాస్) రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా తెలంగాణ సంస్కృతి సారధి చైర్పర్సన్ గుమ్మడి వెన్నెల, ఎన్సిపిసిఆర్ ఫార్మర్ చైర్ పర్సన్ శాంతా సిన్హా, డైరెక్టర్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఏఎంవో జెండర్ కళ్యాణి నంద్యాల, ఎం వి ఆర్ ఫౌండేషన్ నేషనల్ కన్వీనర్ వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్నేహ హస్తం కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో స్వయం సహాయక బృందాల తరహాలో కిషోర బాలికల బృందాలను ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం పనిచేయాలని నిర్ణయించడం శుభ పరిణామం అన్నారు. ఈ మార్పు కోసమే బాలికలు ఎదురుచూస్తున్నారనీ అన్నారు. సమాజంలో తమ స్థాపన కోసం సమానత్వం కోసం మరింత ఉత్సాహంతో పోరాడుతున్నారని బాల కార్మికతకు వ్యతిరేకంగా గళం రిపీ బడికి పోతామని పట్టుబడుతున్నారన్నారు. తల్లిదండ్రులు బంధువులు స్థానిక పెద్దలను ఎదిరించి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా తమ హక్కులను చాటుకుంటున్నారన్నారు . బాలికలు ఇళ్లలో సమాజంలో పాఠశాలలో ఎదుర్కొన్న వివక్ష అనుభవాలను పంచేందుకు కుటుంబ సభ్యుల ఉపాధ్యాయుల కమ్యూనిటీ దృక్పథాలతో లింగ సమానత్వం పై మార్పులు ఎలా తీసుకురావచ్చు ఆలోచన చేసే సురక్షితమైన వేదికనే తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య అని, ఇక చాలు అనే నినాదంతో టిఏఎస్ (టాస్) చేస్తున్న కార్యక్రమాలను తెలుసుకొని వివిధ ప్రాంతాలు ఆడపిల్లలు బాలికల హక్కులకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. విద్యకు రాష్ట్ర బడ్జెట్లో 15 విధులు కేటాయించాలని, బాలికల వికాసం కోసం స్పష్టమైన విద్యా లక్షణాలు నిర్దేశించాలని, కళ్యాణ లక్ష్మీ పథకం బదులుగా ఉన్నత విద్యా అవకాశాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. పిల్లలందరికీ ఉచిత రవాణా సౌకర్యం, పాఠశాల జూనియర్ కళాశాలలో అవసరం ఉన్న టీచర్లను నియమించాలన్నారు. నిలిపివేషన్స్ స్కాలర్షిప్స్ వెంటనే అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల అందరికి అందుబాటులోకి తేవాలని పిల్లల కావాల్సిన కులం ఆదాయం ఆధార్ లాంటి సర్టిఫికెట్లు అన్ని ప్రభుత్వమే బాధ్యత వహించి ఇచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

# సాదాసీదాగా సాగిన కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశం




కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటెల,ఎమ్మెల్యే శ్రీగణేష్, బ్రిగేడియర్ రాజీవ్, బోర్డు మెంబర్ బానుక నర్మధ

**కంటోన్మెంట్,నవంబర్ 22 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్, సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేదిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ప్రతి నెల కంటోన్మెంట్ బోర్డు నిర్వహిస్తున్న వాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వాటి పరిష్కారం కోసం ఒ ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి ఒక అధికారిని నియమించాలన్నారు. బస్తీలో పర్యటనలో తన దృష్టికి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వెయ్యి కోట్లతో ఆర్.కె.పురం నుంచి ఏఓసి మీదుగా బేగంపేటకు వచ్చే ప్రయాణికులకు ప్రత్యేమ్నాయ రహదారులను ఏర్పాటు చేయాలన్నారు. రక్షణ శాఖ వాటికి అనుమతులు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రహదారులు నిర్మిస్తుందన్నారు. బోర్డు పరిధిలో అక్రమ నిర్మాణాల పట్ల సమగ్ర విచారన, సమగ్ర పరిశీలనపట్ల పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.బోర్డు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

## కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్లను ఉపసంహరించాలి: రాంబాబు యాదవ్




ప్రసంగిస్తున్న బీఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్

**చిక్కడపల్లి నవంబర్ 22 (ప్రభాతవార్త) :** కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్లను బిజెపి ప్రభుత్వం అమలు కు జారీ చేసిన నోటిఫికేషన్ ను వ్యతిరేకిస్తున్నామని, వెంటనే ఈ నోటిఫికేషన్ ను ఉపసంహరించాలని బీఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ డిమాండ్ చేసారు. శనివారం బాగ్ లింగంపల్లి లో బిఆర్టీయూ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు, గరిష్ట లాభాల కోసం చేసిన నష్టదాయక నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్మిక నిబంధనలను, సంక్షేమాన్ని తుంగలో తొక్కి, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే 29 కార్మిక చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్లు బిజెపి ప్రభుత్వం తెచ్చిందనీ, ఆత్మనిర్భర్ పేరుతో బిజెపి ప్రభుత్వం బరితెగించి ఈ చర్యను తీసుకున్నదన్నారు. 4 లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా 2020సం. నుండి 2025 జూలై 9 దేశవ్యాప్త సమ్మె వరకు 5 సం.ల పాటు సమ్మెలు, ఉద్యమాల్లో కోట్లాది కార్మికుల నిరసనలను పరిగణలోకి తీసుకోలేదన్నారు. నవంబర్ 13న ఢిల్లీలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాలు లేబర్ కోడ్స్ అమలును నిలిపివేయాలని డిమాండ్ చేసినా ఖాతరు చేయలేదనీ, ఈ స్థితిలో లేబర్ కోడ్ల అమలుకు రూల్స్ నిర్ణయించడం యాజమాన్యాల దోపిడీకి అంతే లేకుండా పోతుందన్నారు.ఈ క్లిష్ట పరిస్థితుల్లో 4 లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని యావత్ కార్మికులు సమరశీల ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని బీఆర్టియు సూచించింది. ఈ సమావేశం లో బిర్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారన్న, కనిసవేతన మండలి మాజీ చైర్మన్ నారాయణ, టివి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జెహెచ్‌పిఎస్‌లో ఆకట్టుకున్న 'ప్రతిభాదర్శన్'




జేహెచ్‌పీఎస్‌లో నిర్వహించిన ప్రతిభాదర్శన్‌లో చిన్నారుల ప్రదర్శన

**జూబ్లీహిల్స్, నవంబరు 22, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జేహెచ్‌పీఎస్)లో శనివారం 1వ తరగతి విద్యార్థులు తాల్ పేరుతో ప్రతిభాదర్శన్ కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. దేశ సాంస్కృతిక కళా చైతన్యాన్ని చాటిచెప్పే అనేక కార్యక్రమాలను ఇక్కడ ప్రదర్శించారు. చిన్నారులు జానపద, సంస్కృతిక నృత్యరీతులతో అద్భుతంగా ప్రదర్శించారు. గరుడ గమన స్వాగత నృత్యంతో చేసిన చిన్నారుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రాథమిక ప్రధానోపాధ్యాయురాలు విధు మోహన్ మాట్లాడుతూ.. సాంస్కృతిక వైభవాన్ని, మన చరిత్రను చాటిచెప్పేందుకు ఇదొక అద్భుతమైన వేదిక అని అన్నారు. కార్యక్రమం ద్వారా విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రాతినిథ్యం వహిస్తూ ప్రసంగాలను, కథనాలను, కవితలను, నృత్యాలను ప్రదర్శించారు. తెలంగాణ, పంజాబ్, జమ్ముకాశ్మీర్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల ఆచారాలను, సంప్రదాయాలను ఇక్కడ చూపారు. పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ.. చిన్నారుల ప్రతిభ ప్రదర్శనకు ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. అధ్యక్షుడు మురళీముకుంద్ మాట్లాడుతూ.. చిన్నారుల ప్రతిభను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రన్సిపల్ పి. కాంచనవల్లి తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానీజైల్‌సింగ్ నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్, చిత్రంలో రాంబాబు తదితరులు ఉన్నారు.

**ఫిల్మ్‌నగర్, నవంబరు 22, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్‌నగర్‌లోని జ్ఞానీ జైల్‌సింగ్‌నగర్ ప్రాంతంలో శనివారం జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడ దెబ్బతిన్న సీవరేజీ పైపుల స్థానంలో నూతన పైపులైను ఏర్పాటుకు, కొత్తగా సీసీ రోడ్డు నిర్మాణాలకు సంబంధించిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ పనులను చేపట్టేందుకు సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో తట్టిఖానా జలమండలి మేనేజర్ రాంబాబు, సీవరేజీ విభాగానికి చెందిన హరిబాబు, బస్తీ నాయకులు పాల్గొన్నారు.

## వందేమాతరం 150 సంవత్సరాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు

**చిక్కడపల్లి నవంబర్ 22 ప్రభాతవార్త :** మన జాతీయ గీతం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ అడిక్ మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా డివిజన్ లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి వందేమాతర జాతీయ గీతాన్ని ఆలాపన చేయటం జరిగింది. కార్యక్రమంలో డివిజన్లోని వివిధ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలి

### ఎసిపి గోపాలకృష్ణమూర్తి

**బేగంపేట నవంబరు 22,ప్రభాతవార్త :** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ ఎంతో అప్రమత్తంగా ఉండాలని,డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదని బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి అన్నారు. శనివారం బేగంపేట డివిజన్ పరిధిలోని మయూరిమార్గ్‌లో సైబర్ నేరాలు ఇతర నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ యుగంలో రోజు రోజుకు సైబర్ నేరగాళ్ల మోసాలు పెరిగిపోతున్నాయని,ఇటీవల వస్తున్న కేసుల విషయంలో పోలీసులు పకడ్బందీగా ఫోకస్ పెడుతున్నామన్నారు.ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో విదేశీ లింకులతో నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని,అలాంటి లింక్‌లు,యాప్స్‌లను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దన్నారు.ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలన్నారు.సైబర్ నేరాలు,మోసాలపట్ల ప్రతి ఒక్కరు తోటి వారికి అవగాహన కల్పించాలని ఏసీపీ స్థానికులకు సూచించారు.ఈ అవగాహనా కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ సైదయ్య,డిఐ శ్రీనివాస్,ఎస్సై షఫీ స్థానికులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ట్రాఫిక్ పోలీసులతో దురుసు ప్రవర్తన

**జూబ్లీహిల్స్, నవంబరు 22, ప్రభాతవార్తః** విధుల్లో ఉన్న అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ ప్రకటన చేసి 48 గంటలు తిరక్కముందే నలుగురు యువకులు మద్యం మత్తులో పోలీసులతో దుర్భాషలాడటమే కాకుండా వారి విధులను అడ్డగించిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10లో శుక్రవారం రాత్రి జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ ఎస్సై రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో అర్ధరాత్రి దాటిన వారుత 1 గంట సమయంలో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అటుగా వచ్చిన ఒక స్కార్పియో వాహనాన్ని నిలిపారు. వాహనం నడుపుతున్న వ్యక్తికి శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించేందుకు ప్రయత్నించగా అతను పోలీసులకు సహకరించలేదు. అతనితోపాటు వాహనంలో ఉన్న హేమంత్ మరో ముగ్గురు ట్రాఫిక్ పోలీసుల విధులను అడ్డుకున్నారు. మమ్మల్ని ఆపే హక్కు మీకు ఎవరిచ్చారు..?, మేము ఎవరిమో తెలుసా..! అంటూ పోలీసులను బెదిరించారు. చేతులతో వారిని వెనక్కి నెట్టడమే కాకుండా లంచం డబ్బులు తీసుకొని వదిలేయండి అంటూ పోలీసులను అవమానించేలా మాట్లాడారు. అక్కడున్న కానిస్టేబుల్‌ను నీ ర్యాంక్ ఏంటి, మమ్మల్ని అడ్డగిస్తావా అంటూ బెదిరించారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనం నడుపుతున్న వ్యక్తిని విద్యాసాగర్‌గా గుర్తించి అతన్ని జూబ్లీహిల్స్ పోలీసులకు అప్ప గించారు. ట్రాఫిక్ ఎస్సై ఫిర్యాదు మేరకు విద్యాసాగర్‌తోపాటు అతనికి మద్దతు పలికిన ముగ్గురిపై కేసు నమోదు చేసి పోలీసు లు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో న్యాయవాదులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గర్ల్‌ఫ్రెండ్ టీజ్ .. ఇరువర్గాలు దాడి

**ఫిల్మ్‌నగర్, నవంబరు 22, ప్రభాతవార్తః** ఒక యువతిని వేధించిన సంఘటనలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన శివశంకర్ గర్ల్‌ఫ్రెండ్‌ను బోరబండ హెచ్‌ఎఫ్‌నగర్‌కు చెందిన షేక్ షాహిల్ టీజ్ చేశాడు. దీంతో శివశంకర్, అతని స్నేహితుడు కపిల్‌స్వామి ఇద్దరు కలిసి షక్ షాహిల్, అతని స్నేహితుడు మహ్మద్ అవేజ్‌తో గొడవ పడ్డారు. దీంతో ఇరువర్గాలు ఒకరితో ఒకరు దాడికి పాల్పడ్డారు. స్థానికులు 100కు సమాచారం అందించడంతో బోరబండ పోలీసులు అక్కడికి చేరుకొని రెండు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భార్యపై ఇనుపరాడ్‌తో దాడి చేసిన భర్త

**ఫిల్మ్‌నగర్, నవంబరు 22, ప్రభాతవార్తః** భార్యపై ఇనుపరాడ్‌తో భర్త దాడికి పాల్పడిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. శంకర్‌లాల్‌నగర్‌లో నివసించే దిలీప్ జీహెచ్ఎంసీలో ప్రైవేటు ఉద్యోగి. మద్యం మత్తులో ప్రతి రోజు ఇంట్లో భార్యను మానసికంగా, శారీరంకగా వేధించేవాడు. ఈ క్రమంలోనే భార్య శోభ గత ఆరు నెలలుగా తన పిల్లలతో కలిసి భర్తకు దూరంగా ఉంది. కాగా ఈ నెల 16న భార్య వద్దకు వెళ్లిన భర్త తాను మారానని నమ్మించి భార్యతో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం పూటుగా మద్యం సేవించి వచ్చిన భర్త తన భార్యతో గొడవకు దిగాడు. కోపంతో పక్కనే ఉన్న ఇనుప రాడ్ తీసుకొని ఆమె కాలిపై బలంగా కొట్టాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయలయ్యాయి. తన భర్తపై చర్యలు తీసుకోవాలంటూ శోభ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి : కార్పొరేటర్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,నవంబరు 22 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు లక్ష్మీగూడ మల్లన్న దేవాలయం పరిసర ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి రోడ్డు పనులు,టిఎన్‌జిఓస్ కాలనీలో అరవై అడుగుల సిసి రహదారి పనులను రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జి,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు.శ్రీ మల్లన్న దేవాలయం కమిటీ ప్రతినిధులతో కలిసి మందిరంలో ఆయన పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు పాండు యాదవ్,మాజీ అధ్యక్షులు అడికే జనార్ధన్,బిజెపి నాయకులు అడికే మారయ్య,ప్రవీణ్ కుమార్ అడికే,మల్లేష్ ,బుచ్చిరెడ్డి, టి.చిన్న,శ్రీ కాంత్ రెడ్డి,రమేష్ రెడ్డి,అశోక్,రాజ్ కుమార్,కృష్ణ, అడికే శివ,కిట్టు ప్రభాకర్,పద్మానందు,ఏ.శివ భార్గవ్,పంతులు, శ్రీనివాస్,సందీప్,అనిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు

# సార్..మా పనులు చేసిపెట్టండి!

-జిహెచ్ఎంసి కార్యాలయాల చుట్టూ కార్పొరేటర్ల చక్కర్లు
-పెండింగ్ పనులు ..కొత్తవాటికి బడ్జెట్ ఇవ్వాలని ఒత్తిళ్లు
-నేతల హడావిడి చూసి బిత్తరపోతున్న అధికారులు
-ఎన్నికల కోసమే అంటూ గుసగుసలు




**హైదరాబాద్, నవంబర్ 22,ప్రభాతవార్త:** నేతల హడావిడి మొదలైందంటే ఎన్నికలు సమీపిస్తున్నట్టే లెక్క... ఇప్పుడు ఇదే హడావిడి గ్రేటర్ వ్యాప్తంగా ఆయా కార్యాలయాల పరిధిలో కనిపిస్తోంది. 2026 ఫిబ్రవరి 10 తో జిహెచ్ఎంసి ప్రస్తుత పాలక మండలి పదవీ కాలం ముగియనుంది. దీంతో వివిధ కార్యక్రమాల ఏర్పాట్లతో పాటు ఆయా కార్యాలయాల్లో పనుల కోసం అధికారుల చుట్టూ కార్పొరేటర్లు చక్కర్లు కొడుతున్నారు. తమ తమ డివిజన్లలో ఉన్న పెండింగ్ పనులతో పాటు ఎన్నికల టైమ్ లో తాము ఇచ్చిన హామీల అమలు అమలు చేసేందుకు ఇప్పుడు రెడీ అవుతున్నారు. దీంతో నేతల హడావిడి చూసి అధికారులు షాక్ అవుతున్నారు. ఇంతకాలం ఏంచేశారని... ఇప్పుడు టెన్షన్ పడుతూ తమను టెన్షన్ పెడితే ఎలా అంటున్నారు. కార్పొరేటర్ల పదవీ కాలం దగ్గర పడుతోంది గెలిచి ఐదేళ్లు దగ్గర పడుతున్నా తమ తమ డివిజన్లలో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. వచ్చే ఏడాదిలో ఎన్నికలు ఉండటంతో అభివృద్ధి పనులు పూర్తి చేయించడానికి మల్లగుల్లాలు పడుతున్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఇక నుంచి ప్రతీరోజు ప్రజల్లో ఉండటానికి ప్లాన్ చేస్తున్నారు. తమ డివిజన్ లో ఉన్న వారికి డబుల్ బెడ్‌రూం ఇప్పించడం, రోడ్లను రిపెయిర్ చేయించడం, సీసీ రోడ్లు వేయించడం, బస్తీ దవాఖానాలను బాగు చేయించి, డాక్టర్లు అందుబాటులో ఉండేలా చూడటం, శానిటేషన్ పరంగా ఇబ్బందులు లేకుండా చూడటం, ప్రతీ ఏరియాకు మంచినీళ్లు వచ్చేలా చూడటం లాంటి పనులు చేయించుకుంటున్నారు.. అలాగే దోమలు లేకుండా ఫాగింగ్ చేయించడం, కుక్కల బెడద లేకుండా చేయించాలని స్థానికులు కార్పోరేటర్లను అడుగుతుండటంతో నిధులతో సంబంధం లేని ఈ పనులను అధికారులతో చేయించుకుంటున్నారు దీంతో కార్పోరేటర్లతో పాటు గత ఎన్నికల్లో ఓడిపోయిన, టికెట్ రాని వారు సైతం స్థానిక ఓటర్లకు సంబంధించిన వివిధ పనులను చేసి పెట్టేందుకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

**అప్పుడు సొంతపనులు...**

సుమారు ఐదేళ్ల క్రితం గెలిచిన కార్పోరేటర్లు ఇన్నిరోజుల పాటు తమతమ పనులు, బిజినెస్‌లు చూసుకుంటూ డివిజన్లలో పబ్లిక్ సమస్యలున్నా వాటిని పట్టించుకోలేదు. ఇన్నిరోజులు కార్పొరేటర్‌గా రాజసం చూపించిన వీరంతా ఇప్పుడు తమ డివిజన్ లో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేయండంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీల నుంచి టికెట్లు పొందాలంటే ఇప్పుడైనా పనిచేసి నిరూపించుకోవడంతో పాటు మరోసారి గెలిచేలా చేసుకోవాలని చూస్తున్నారు. ఎన్నికల టైమ్ లో తమ డివిజన్ లో ఇచ్చిన హామీలు పూర్తి చేస్తేనే మళ్లీ ఓట్లు పడుతాయని బల్దియా హెడ్ ఆఫీస్‌తో పాటు జోనల్, సర్కిల్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు.

**ఇప్పుడు కోట్లలో పనుల లిస్ట్..**

తమ డివిజన్ పరిధిలో చేయాల్సిన అభివృద్ధి పనులు లిస్ట్ తయారు చేసి అధికారుల ముందు పెడుతున్నారు. దీంతో ఆలిస్ట్‌లు చూసి అధికారులు షాక్‌కు గురవుతున్నారు. హుటాహుటిన వచ్చి కోట్ల రూపాయల పనుల కోసం రిక్వెస్ట్‌లతో పెట్టడం చూసి ఇదెక్కడి సమస్యరా అని అనుకుంటున్నారు. కాని కార్పోరేటర్లు మాత్రం ఎలాగైనా ఈ పనులు చేసి పెట్టండని రోడ్లు, కాల్వలు, శానిటేషన్ సమస్యలతో పాటు కమ్యూనిటీ హాల్స్,స్ట్రీట్ లైట్స్, ఇతర పథకాల అమలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అధికారుల ముందుంచుతున్నారు. కార్పోరేటర్ స్పెషల్ ఫండ్స్ కింద డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలకు స్పెషల్ ఫండ్ కేటాయించాలని జీహెచ్ఎంసీ కమీషనర్, మేయర్‌ను కోరుతున్నారు. ఈనిధుల ద్వారా పలు అభివృద్ధి పనులు చేపట్టొచ్చని భావిస్తున్నారు.ఆరు నెలల కింద డివిజన్ల వారీగా స్పోర్ట్స్ ఎక్విప్మెంట్ డెవలప్మెంట్ కోసం స్పెషల్ ఫండ్ కేటాయించారు. అలాగే మిగతా పనుల కోసం కేటాయించాలని కోరుతున్నారు. కొంతమంది కార్పొరేటర్లు తమ డివిజన్లోని ప్రజలను తీసుకువచ్చి మరీ ప్రజావాణిలో కంప్లెయింట్ ఇప్పిస్తున్నారు.దీంతో కార్పొరేటర్ల హడావిడిని చూసి వచ్చే మున్సిపల్ ఎన్నికల కోసమే ఇదంతా చేస్తున్నారని గుసగుసలాడుతున్నారు.

## అక్రమాలకు కారణం అధికార పార్టీనేతలు, జిహెచ్ఎంసి అధికారులే

**టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా**

**ముషీరాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త:** నగరంలో అక్రమ కట్టడాలు కడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ యధేచ్ఛగా దోపిడీ చేయటానికి అధికార పార్టీ నేతలు, జీహెచ్ఎంసీ అధికారులే కారణమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయి బాబా ఆరోపించారు. శనివారం హైదరాబాద్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ హైదరాబాద్ నగరంలో అనుమతికి మించి బహుళ అంతస్థు లు కడుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవటం వెను క ప్రభుత్వ పెద్దల ప్రమేయం ఉందని అనుమానాలు వ్యక్తమవు తున్నాయని అన్నారు. పేదవాడు 50 గజాల స్థలంలో ఇల్లు కట్టుకుంటే మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణం అంటూ కూల్చే స్తున్నారు, మరి అక్రమంగా బడా బాబులు కట్టే బహుళ అంతస్థుల భవనాలు అధికారుల కళ్లకు కనిపించటం లేదా అని ప్రశ్నించారు. రామానాయుడు స్టూడియో, అన్నపూర్ణ స్టూడియో వంటి పెద్ద సంస్థలు ట్రేడ్ లైసెన్స్ ఫీజులను దశాబ్దాలుగా తక్కువ కడుతూ జీహెచ్ఎంసీ ఖజానాకు గండి కొడుతూ ఉంటే పత్రికల ద్వారా బయటకి వచ్చింది తప్ప, జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం మౌనం గానే ఉన్నారని ఆరోపించారు. ట్రేడ్ లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్ అక్ర మాలలో భాగస్వాములైన అధికారులందరిపైనా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ముషీరాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాంధీ.నగర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐడిహెచ్ కాలనీలో జాగృత్ హైదరాబాద్, సురక్షిత్ హైదరాబాద్ పేరుతో సైబర్ నేరాలపై అవగా హనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐ మాట్లాడు తూ ఆన్‌లైన్‌లో ఎవరైనా మోసానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930కి ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని అన్నారు. డబ్బులు పోయిన గంటలోపు ఫిర్యాదు చేస్తే పోయిన డ్బులు తిరిగి ఇప్పించేందుకు వీలవు తుందని తెలిపారు. తెలియని వ్యక్తి నుంచి వాట్సాప్, టెలిగ్రామ్‌లలో సందేశాలు వచ్చి, పెట్టుబడికి లాభాలు అంటూ వివరిస్తే అనుమానించాలని కోరారు.



నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



కళా మహోత్సవంలో కళాకారులు

## అంగరంగ వైభవంగా భారతీయ కళా మహోత్సవం

**అల్వాల్, నవంబరు 22 ప్రభాతవార్త:** బొల్లారం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవం అంగరంగ వైభవంగా సాగుతోంది. దేశీయ సంస్కృతి సాంప్రదయాలకు సంబంధించిన నృత్య కళారూపాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు, కళాకారులుతో రాష్ట్రపతి నిలయం నూతన శోభను సంచరించుకుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 21 శుక్రవారం భారతీయ కళా మహోత్సవాన్ని ప్రారంభించారు. దక్షిణాది నుంచి మొదలు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ కళా నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఈ నెల 22 నుంచి 30 తేదీ వరకు జరిగే కళా మహోత్సవాన్ని ప్రజలు నేరుగా తిలకించే వెసులుబాటు ఉంది. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటలు వరకు రాష్ట్రపతి నిలయంలోకి అనుమతి ఉంటుంది. కేంద్రీయ సాంస్కృతిక, పర్యాటక, వస్త్ర శాఖలు సంయుక్తంగా కళా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి.

# ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాల కూల్చివేత

-రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిక
-పేదలకు ఒక్క న్యాయం... పెద్దలకు ఓ న్యాయమా : బాధితులు
-నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం దారుణం
-జిల్లా ఎఐటియూసి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి



**అత్తాపూర్ నవంబరు22,ప్రభాతవార్త :** రోడ్లను ఆక్రమించి వ్యాపారులు డబ్బాలు,షెడ్లు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ పేర్కొన్నారు.శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి నుండి ఆరాంఘర్ ప్రధాన రహదారి పరివార్ దాభా వరకు ఫుట్‌పాత్‌లపై వెలసిన చిరువ్యాపారుల డబ్బాలు,రేకుల షెడ్లపై అందిన ఫిర్యాదుల మేరకు రాజేంద్రనరగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి ఆదేశాలతో భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు.దింతో వ్యాపారాస్తులు,అధికారుల మధ్య కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.ఎవ్వరైనా రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు,సిఐలు క్యాస్ట్రో, నాగేశ్వర్ రావు,తదితరులు ఉన్నారు.

**మమ్మల్ని రోడ్డు పాలు చేశారు : బాధితులు**

తాము చిన్న చిన్న వ్యాపారులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటే ఎలాంటి సమాచారం ఇవ్వకుండా డబ్బాల తొలగించి రోడ్డుపాలు చేయడం సరైంది కాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.పేదలకు ఒక్క న్యాయం..పెద్దలకు ఓ న్యాయమా దమ్ముంటే అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న బడాబాబుల షెడ్లను కూల్చివేయాలని వాపోయారు.

**నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేయడం దారుణం : వనంపల్లి జైపాల్ రెడ్డి**

అరాంఘర్ చౌరస్తాలో రోడ్డు ప్రక్కన ఉన్న డబ్బాలను జిహెచ్ఎంసి అధికారులు తొలగిస్తున్నారని విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అక్కడికి వెళ్లి బాధితులతో మాట్లాడడం జరిగింది. మున్సిపల్ అధికారులు రోడ్డు ప్రక్కన డబ్బాలను తొలగించాలంటే బాధితులకు 15 రోజుల ముందు నోటీసులు ఇవ్వాలి.ఎలాంటి నోటీసులు బాధితులకు ఇవ్వకుండా రోడ్డు ప్రక్కన డబ్బాలు వేసుకొని జీవనోపాధి సాగిస్తున్న కుటుంబాలని రోడ్డుపాలు చేయడం దారుణమని అన్నారు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి జీవనోపాధి కోసం డబ్బాలు వేసుకుంటే మున్సిపల్ అధికారులు ,పోలీసులు డబ్బాలలో ఉన్న సామాన్లను తీసుకునే అవకాశం ఇవ్వకుండా జెసిపితో పూర్తిగా నేలమట్టం చేయడం సిగ్గుచెట్టు అన్నారు.కరెంట్,మున్సిపల్ అధికారులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. జీవనోపాధి కోల్పోయిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఏదో ఒక దగ్గర జీవనోపాధి చూపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

## -హైదరాబాద్ సిపి విసి సజనార్



చార్మినార్ వద్ద అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ వీసీ సజ్జనర్

**చార్మినార్,నవంబరు 22 ప్రభాతవార్త :** సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరూ చాలా అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ అన్నారు.చార్మినార్ వద్ద శనివారం నిర్వహించిన జాగృత్ హైదరాబాద్- సురక్షిత్ హైదరాబాద్ సైబర్ నేరాల అవగాహన కార్యక్రమానికి నగర సీపీ వీసీ సజ్జనర్ ముఖ్య అతిధిగా విచ్చేశారు.పోలీస్ అధికారులతో కలిసి ఆయన చార్మినార్ పరిసర ప్రాంతాలలో ప్రజలకు,వ్యాపారులకు సైబర్ క్రైమ్ నివారణ కర పత్రాలు పంపిణీ చేశారు.చార్మినార్ నుంచి మదీనా వరకు తల పెట్టిన సైబర్ క్రైమ్ అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని నేర రహితంగా మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రతీ మంగళ,శనివారాలలో జాగృత్ హైదరాబాద్-సురక్షిత్ హైదరాబాద్ సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ఈరెండు రోజులు ప్రతీ ఇంటికి వెళ్లి పోలీస్ అధికారులు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నారని ఆయన తెలిపారు.అవగాహన లేనందున అనేక మంది సైబర్ నేరాల భాదితులవుతున్నారని,సైబర్ నేరాల నివారణకు ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామని,స్వచ్ఛంధంగా వలంటీర్లుగా ముందుకు వచ్చి వారు సైబర్ సింబాలుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన తెలియజేశారు.ప్రతీ ఇంట్లో ఒక సైబర్ సింబా తయారై తన కుటుంబాన్ని, సమాజాన్ని సైబర్ నేరాలు నుంచి రక్షించాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రైవేట్ ఫోటోలు,వ్యక్తి గత వివరాలను సోషల్ మీడియాలలో అప్లోడ్ చేయవద్దని అలా చేస్తే ట్రాప్ చేసిమోసం చేసే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.పిల్లలు సోషల్ మీడియాకు అడిక్ట్ అవుతున్నారని,ముఖ్యంగా ఆడ పిల్లలు అజ్ఞాత వ్యక్తులతో చాటింగ్ చేసి వ్యక్తి గత వివరాలను సమర్పించుకొని బాధితులు అవుతున్నారని ఆయన తెలిపారు.ఆడ పిల్లల విషయంలో తల్లి దండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలని,వారికి ఫోన్లు ఇచ్చే ముందు జాగ్రత్తలు చెప్పాలని ఆయన తెలియజేశారు.సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుంటున్న డిజిటల్ అరెస్ట్‌మోసాల పట్ల వారి పిల్లలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని,సైబర్ మోసం జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును తిరిగి రాబట్ట వచ్చునని ఆయన తెలిపారు. అనుమానస్పద కాల్స్,లింక్స్,యాప్‌లను నమ్మ వద్దని,ఓటీపీలు,పాస్వర్డ్లు, బ్యాంక్ వివరాలను ఎవరితోనే పంచు కోవద్దని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అడిషనల్ సిపి క్రైమ్ అండ్ సిట్ ఎం.శ్రీనివాస్,సౌత్ జోన్ అడిషనల్ డిసిపి ఎం.మాజిద్,సౌత్‌జోన్ ఏసిపిలు జి.శ్యామ్ సుందర్,ఎంఎ జావిద్,సిహెచ్ చంద్రశేఖర్,పి.చంద్రశేఖర్,చార్మినార్ ఇన్‌స్పె క్టర్ ఏ.రమేష్,హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ ఆంజనేయలుతో పాటు పలువురు పోలీస్ అధికారులు,పాఠశాలల విద్యార్డులు,పీస్ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చదువుతోనే సమాజంలో మార్పు : కలెక్టర్ హరి చందన దాసరి

**హైదరాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త:** చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ఆదిశగా విద్యార్థులు ముందుకు వెళ్లాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి సూచించారు. నారాయణగూడ లోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన 14వ స్నాతకోత్స వ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొని 2023-24 విద్యాసంవత్స రంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఉన్న రాజా బహదూర్ వెంకటరామారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాల అడిటోరియంలో ఏర్పాటు చేసిన స్నాతకోత్స వ వేడుకల్లో ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్తు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిరంతర అధ్యయనం ముఖ్యమని చెప్పారు. భవిష్యత్ అంతా యువ తరానిదే అని అన్నారు. కళాశాల చదువు ముగిసిన వెంటనే ఉద్యోగాలు, పోటీ పరీక్షలు, ఉన్నత విద్య వంటి ఎన్నో మార్గాలు ఉన్నాయని, వాటిలో ఏదైనా ఒక్క దానిని ఎంచుకుని దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. డిజిటల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రజంటేషన్స్ మెరుగుపరుచుకోవాలని, ఇవి ఉద్యోగ విపణిలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం జీవితాంతం విద్యార్థులకు బలమని, సమాజం కోసం సేవాభావంతో పనిచేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఉన్నత విద్య జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర సింగ్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జె. అచ్యుతదేవి, హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ కట్టా ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ జి. సుదర్శన్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి. వాణి మాధవి, వైస్ ప్రిన్సిపల్ కె. సింధూరి, కన్వీనర్ డాక్టర్ ఎం.సుచిత్ర, కో కన్వీనర్ డాక్టర్ కె. స్వప్న తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు సర్టిఫికేట్స్ అందజేస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి

## అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

**జూబ్లీహిల్స్, నవంబరు 22, ప్రభాతవార్తః** అమీర్‌పేట ప్రాంతంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి శనివారం కమ్మసంఘ నాయకులతో కలిసి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన నవీన్‌యాదవ్ పరిశీలించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ప్రచారంలో భాగంగా అమీర్‌పేట ప్రాంతంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తామని హామినిచ్చారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఎల్లారెడ్డిగూడలోని జయప్రకాశ్‌నగర్‌లో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నవీన్‌యాదవ్‌తోపాటు కమ్మసంఘాల నాయకులు, స్థానికులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. వీరంతా జయప్రకాశ్‌నగర్ నుంచి నడుచుకుంటూ అమీర్‌పేటలోని మైత్రివనం కూడలికి చేరుకున్నారు. అక్కడ విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ఎంత ఎత్తులో ఏర్పాటుచేయాలి, ఎలాంటి విగ్రహం ఏర్పాటుచేయాలి, ఎంత కాలంలో ఏర్పాటు చేయాలి తదితర అంశాలను అక్కడున్న సంఘాలతో కలిసి చర్చించారు. స్థానికుల సూచనలను పరిగణలోకి తీసుకొన్న నవీన్‌యాదవ్ ముఖ్యమంత్రితో చర్చించి తగిన నిర్ణయాన్ని తీసుకుంటామని స్పష్టం చేశారు.



ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి స్థలం వద్దకు ర్యాలీగా వెళ్తున్న నవీన్‌యాదవ్, కమ్మసంఘాల నాయకులు

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు ద్వారా మైత్రివనం ప్రాంతంలో ఒక సంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో సోమాజీగూడ డివిజన్ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కమ్మసంఘానికి చెందిన కొల్లి లక్ష్మణ్, బొడ్డు రవిశంకర్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అమీర్‌పేటలో రూ.25 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన హైడ్రా



హైడ్రాతో కోట నీలిమ

**సంజీవరెడ్డి నగర్,నవంబర్ 22 ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి న్యాయకత్వంలో ఏర్పాటు చేసిన హైడ్రా అధికారులు అమీర్‌పేట డివిజన్ పరిధిలోని సుమారు రూ.25 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడారని పీసీసీ వైస్ ప్రెసిడెంట్,సనత్ నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమ తెలిపారు. కొన్ని దశాబ్దాల క్రితం పార్కు కోసం కెటాయించిన 1500 గంజాల స్థలాన్ని కొంత మంది కబ్జా చేసేందుకు ప్రయత్నించగా స్థానికుల ఫిర్యాదుతో ఈ విషయాన్ని హైడ్రా దృష్టికి తీసుకెళ్లామన్నారు. తాజాగా హైడ్రా అధికారులు పరిశీలన చేపట్టి ఆ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా నిర్ధారించి శనివారం స్థలం చుట్టూ ఫెన్సింగ్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ స్థలాన్ని సందర్శించిన కోట నీలిమ హైడ్రా పట్ల హర్షం వ్యక్తం చేశారు. త్వరలో ఆ స్థలంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా ఆధునీక పార్కును నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న తీసుకువచ్చిన హై డ్రా వ్యవస్థ వలన ప్రతిపక్ష నాయకుల కుట్రలు బట్టబయలై ప్రభుత్వ స్థలాలు రక్షించబడుతున్నాయన్నారు. రూ.25 కోట్ల విలువైన స్థలాన్ని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం పట్ల స్థానికులు అనంతం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



హైటెక్స్‌లో జరిగిన తెలంగాణ నార్త్‌ఈస్ట్ కనెక్ట్ ప్రారంభోత్సవంలో భాగంగా సంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## సున్నంచెరువు ప్రాంత నివాసితులతో హైడ్రా సమావేశం

**-ఆంజనేయ గుడితో పాటు.. చిల్లా తరలింపునకు అంగీకారం**



రంగనాథ్‌తో సున్నం చెరువు ప్రాంత నివాసితులు

**హైదరాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త:** మాదాపూర్, బోరబండ సరిహద్దుల్లోని సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్న ఆంజనేయ గుడితో పాటు..ముస్లింల ప్రార్థనా స్థలం చిల్లా తరలింపునకు అంగీకారం కుదిరింది. సున్నం చెరువు పరిసర ప్రాంత ప్రజలతో శనివారం హైడ్రా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇరు పక్షాలకు చెందిన వారు ఇందుకు సమ్మతి వ్యక్తం చేశారు. హైడ్రా మొదటివిడతలో పునరుద్ధరిస్తున్న ఆరు చెరువుల్లో సున్నం చెరువు కూడా ఉందనే విషయం అందరికీ విధితమే. అయితే ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో చిన్న ఆంజనేయగుడితో పాటు.. ఆసమీపంలోనే ముస్లింల చిల్లా కూడా ఉంది. ఇవి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్నందున వీటిని చెరువు గట్టువైపు తరలించాలని హైడ్రా భావించింది. వీటి తరలింపునకు సంబంధించిన అంశం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశం అయ్యింది. ఈ నేపథ్యంలో ఇరు పక్షాలకు చెందిన స్థానికులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం హైడ్రా కార్యాలయంలో చర్చించారు. సుప్రింకోర్టు మార్గదర్శకాలను వివరించారు. ఆంజనేయ విగ్రహంతో పాటు, చిల్లాను చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కాకుండా.. చెరువు గట్టు వైపు తరలించే విషయమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇరు పక్షాలకు చెందిన స్థానికులు అంగీకారం చెప్పడంతో ఈ సమస్యకు పరిష్కారం దొరికింది. సున్నం చెరువు చెంత.. వాటిని సురక్షితంగా తరలించడానికి స్థానికులు అంగీకారం వ్యక్తం చేశారు. దీంతో ఈ సమస్యకు తెరపడింది.

## లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

**సైఫాబాద్, నవంబరు 22 ప్రభాతవార్త:** దేశంలోని కోట్లాది మంది కార్మికులకు అనుకూలంగా ఉన్న 44 కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేసి 4 కోడ్‌లను తెచ్చి అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆనేక మంది కార్మికులు శనివారం హిమాయత్‌నగర్‌లో వైజంక్షన్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి ఇన్‌చార్జీ వి.ఎస్.బోస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మసి పూసి మారేడు కాయ చేసినట్లు కనీస వేతనాలను సమయానుకూలంగా చెప్పె ప్రధాని నరేంద్రమోదీ కనీస వేతనం ఎంత చెల్లిస్తామో చెప్పలేని స్థితిలో ఉన్నారని ఆరోపించారు. సంఘటిత, అసంఘటిత కార్మికులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలని, యాజమాన్యాలకు చెప్పడం తప్ప సరైన నియామాలను రూపొందించకుండానే కార్మిక వర్గానికి అరచేతిలో స్వర్గం చూపించే మాంత్రికుడు మోదీ అని ఆయన నిశితంగా విమర్శించారు. తక్షణమే 44 కార్మిక చట్టాలను అమలు చేస్తామని కేంద్ర ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా కార్మికులు ఆందోళనలు చేపడతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నేతలు ఎస్.బాల్‌రాజ్, కె.ఏసురత్నం, కమతం యాదగిరి, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.


మంత్రిని సన్మానిస్తున్న నక్క రాములుగౌడ్

## మంత్రిని సన్మానించిన నక్క రాములుగౌడ్

**గజ్వేల్, నవంబరు 22 (ప్రభాతవార్త):** ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొనగా కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నక్క రాములుగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇందిరమ్మ చీరలు అద్భుతంగా ఉన్నాయని, ప్రతి ఒక్క మహిళకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, అజ్గర్, పూజారి శ్రావణ్‌కుమార్, మన్నె అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించిన ఎంపి, ఎమ్మెల్యే

**చేర్యాల, నవంబరు 22, ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా నూతన భవనం నిర్మించడం జరిగిందని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం చేర్యాలలోని బీడి కాలనీలో రూ.8కోట్ల70లక్షలతో నిర్మించిన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.హైమావతితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి గదులను, సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఆసుపత్రిలో ఫర్నిచర్,వైద్య పరికరాలు,మెడిసిన్‌తో పాటు అన్ని సౌకర్యాలు సమకూర్చుకుని అతి త్వరగా రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ అనారోగ్య సమస్య వచ్చినా వరంగల్ ఎంజీఎంపై లేదా హైదరాబాద్ పెద్ద ఆసుపత్రులపై ఆధారపడాల్సి వచ్చేదని గుర్తుచేశారు. కొత్త హాస్పత్రి భవనం ప్రారంభంతో ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు.నూతన భవనం ఎంతో అందంగా, సక్రమంగా నిర్మించబడిందని అభినందిస్తూ,ఇప్పుడున్న మిగతా అవసరాలను తీర్చేలా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఇంకా బలోపేతం చేయాల్సి ఉందని తెలిపారు.ప్రత్యేకంగా మాన్‌పవర్,డాక్టర్లు,పారామెడికల్ సిబ్బంది, నర్సులు కొద్దిగా తక్కువగా ఉన్న విషయాన్ని గుర్తించి ఆ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్,ప్రభుత్వాన్ని కోరారు.కనీసం ఐదు మందికి అయినా డయాలిసిస్ సేవలు అందించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

## 24న అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

### జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మల్లికార్జున్

**సిద్దిపేట అర్బన్, నవంబరు 22, ప్రభాతవార్త :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న అండర్-14 జిల్లా జట్టు ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని క్రికెట్ స్టేడియంలో జట్టును ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జట్టు ఎంపిక ఉదయం 9 గంటల నుంచి స్టేడియంలో ప్రారంభం అవుతుందన్నారు. 2011 సెప్టెంబర్ నుంచి 2013 ఆగస్టు 31 తర్వాత జన్మించిన వారు జట్టు ఎంపికకు అర్హులన్నారు. యూనిఫాం,క్రికెట్ కిట్స్, ఇతర క్రీడా సామాగ్రితో క్రికెట్ స్టేడియంలో హాజరు కావాలన్నారు.బాలురులు అండర్-14, 2011 సెప్టెంబర్ 1, 2013 ఆగస్టు 31 వరకు తర్వాత జన్మించిన వారు జట్టు ఎంపికకు అర్హులన్నారు.

## నాలుగు లేబర్ కోడ్స్ అమలు వెంటనే నిలిపివేయాలి

**కొమురవెల్లి, నవంబరు 22, ప్రభాతవార్త :** కార్మికుల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ అమలుకు విడుదల చేసిన నోటిఫికేషన్ వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కొమురవెల్లిలో శనివారం సిఐటియూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకవచ్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. పని గంటలు పెంచి కార్మికుల హక్కులను కేంద్రప్రభుత్వం కాలరాస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐటియూ నాయకులు రోడ్డు నరసింహులు, రవి, కవిత, సుశీల, చంద్రం పాల్గొన్నారు.

## విద్యార్థికి యువశాస్త్రవేత్త అవార్డు

**పాపన్నపేట, నవంబరు 22, ప్రభాతవార్త :** పాపన్నపేట మండలం చీకోడ్‌లింగాయిపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి శివచైతన్య రూపొందించిన మోడ్రన్ మల్టిపర్పస్ అడ్వాన్స్ హైడ్రాలిక్ అనే ఆవిష్కరణ ఇటీవల ఎన్ సీఆర్టీ ద్వారా జాతీయ స్థాయికి ఎంపికైంది.ఈ మేరకు ఈనెల18 నుంచి 23 వరకు మధ్యప్రదేశ్ భోపాల్ లో జరుగుతున్న ప్రదర్శనలో పాల్గొన్నాడు.ప్రదర్శనలో భాగంగా శనివారం అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో "పర్యావరణ్ సంస్కృతి సంరక్షణ్ ఎవం మానవ్ కల్యాణ్ ట్రస్ట్ నుంచి యువశాస్త్రవేత్త అవార్డు అందుకున్నాడు.ఈ సందర్భంగా విద్యార్థిని, గైడ్ ఉపాధ్యాయుడు కిషన్ ప్రసాద్ ను ఉపాధ్యాయ బృందం, మండల వాసులు అభినందించారు.

## పాఠశాలకు క్రీడాసామాగ్రి అందించాలని వినతి

**ధూళిమిట్ట, నవంబరు 22,ప్రభాతవార్త :** పాఠశాలకు క్రీడాసామాగ్రి అందించాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేనా రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ చెట్కూరి కమలాకర్ యాదవ్ తెలిపారు.మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలంటే వారికి సరిపడా మౌలిక సదుపాయాలు కల్పించి వారికి క్రీడాసామాగ్రి అందించినట్లయితే విద్యార్థులు క్రీడల్లో రాణించే అవకాశం ఉందని శనివారం రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ హైదరాబాద్లోని వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించి వివరించడం జరిగిందన్నారు.దీనిపై చైర్మన్ తొందరలోనే క్రీడాసామాగ్రి అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.

## నూతన గ్రంథాలయం ప్రారంభం

**నారాయణఖేడ్, నవంబరు 22 ప్రభాతవార్త :** పట్టణంలోని జిల్లా బాలిక ఉన్నత పాఠశాలలో ఈరోజు సర్వోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన గ్రంథాలయం మరియు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసినందున గ్రంథాలయాన్ని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో సిర్గాపూర్ మండల కేంద్రంలో కూడా ఈ ఫౌండేషన్ సహకారంతో గ్రంథాలయం ఏర్పాటు చేయడం జరిగిందని ఇప్పుడు పట్టణంలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో అనేకమంది విద్యార్థులు చదువుతున్నారని ఈ పాఠశాలకు గ్రంథాలయం అవసరమని సర్వోదయ ఫౌండేషన్ సంస్థకు అడగగానే ఏర్పాటు చేసినందుకు సర్వోదయ ఫౌండేషన్ సంస్థ మేనేజ్మెంట్ సభ్యులందరికీ ఎమ్మెల్యే విద్యార్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలానే మీ సేవలు ప్రతి ఒక్క పేద విద్యార్థులకు పేద ప్రజలకు అందించాలని దానికి మా సహకారం కూడా అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు సుధాకర్ నాయక్ ఐఆర్ఎస్, సర్వోదయ ఫౌండేషన్ చైర్మన్ జీవుల నాయక్ మాజీ ఎంపీపీ,అశోక్‌రెడ్డి పీఏసీఎస్ చైర్మెన్, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలని రాష్ట్ర కార్మిక,ఉపాధి కల్పన, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం సిద్దిపేట నియోజకవర్గంలోని మహిళా సంఘాల మహిళలకు 42487 ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ అప్పగించే ప్రతి పనిని సమర్ధవంతంగా నిర్వహించి మన్ననలను పొందుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో మహిళలు మహిళా శక్తులుగా ఎదుగుతున్నారని తెలిపారు. అన్నిరంగాలలో మహిళలను ముందుకు తీసుకెళ్లాడానికి సిఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందిరా గాంధీ 11 యేండ్లు దేశ మహిళ ప్రధానిగా పని చేసి ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకవచ్చిందన్నారు. జిల్లాలో వడ్డీలేని రూ.28 కోట్ల రుణాలను అందించేందుకు సిద్దంగా ఉన్నాయని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కార్మికశాఖ తరపున సిద్దిపేటలో మహిళా సెల్ఫ్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు చేయడానికి చర్యలుతీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లాలో 11 వేల ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించడం జరిగిందన్నారు.సిద్దిపేట నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చాలా చక్కగా జరుగుతుందన్నారు. వచ్చే యేడాది మరో 3500 ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో మహిళా సంఘాల పెట్రోల్ బంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పేదల కోసం సర్కార్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడారు.కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీఒ సదానందం, డిఆర్‌డిఎపిడి జయ దేవ్‌ఆర్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం విఫలం

### -మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, నవంబరు 22 (ప్రభాతవార్త):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేసే లబ్ధిదారులు అప్పులపాలయ్యారని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం అప్పుచేసి వడ్డీ కట్టలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అరచేతిలో వైకుంఠం చూపించి ఆచరణలో అందనంత దూరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కోటలు దాటాయని, ఇందిరమ్మ ఇళ్లు ప్రతి పేద వాడికి అందుబాటులో ఉంటుందని నమ్మించి లబ్ధిదారులను అప్పులపాలు చేశారన్నారు. ఇందిరమ్మ ఇళ్లను పూర్తి స్థాయిలో ప్రభుత్వం కట్టించి లబ్ధిదారులచే గృహ ప్రవేశం చేయించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినట్లు ఇందిరమ్మ ఇల్లు కట్టుకుంటే సుమారు 15 లక్షల వరకు ఖర్చు అవుతుందని, ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలు ఏమి సరిపోతాయన్నారు. మార్కెట్‌లో ఇసుక, సిమెంట్, స్టీల్ ధరలు మండిపోతున్నాయని, ప్రభుత్వం రూ.5 లక్షలు ఇచ్చి రూ.15 లక్షలు అప్పు చేయిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియలో కూడా అవకతవకలు జరిగాయని, ఇళ్లు కట్టుకునే వారికి ఇళ్లు మంజూరు కాలేదని, ఎవరికైతే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యిందో వారు కట్టుకోవడం లేదని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు, అవివేకానికి నిదర్శనమని ఎద్దేవ చేశారు. ఇప్పటికైనా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ఎంపిపిల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, నూనె కుమార్‌యాదవ్, సుగుణ దుర్గయ్య, అనంతుల ప్రశాంత్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, భద్రప్ప, స్వామి, అహ్మద్, ఐలయ్య, మంచాల పెద్ద శ్రీనివాస్, ఎల్లం, జిర్ర రాజు, రాజిరెడ్డి, మర్కంటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

**గజ్వేల్ టౌన్, నవంబరు 22 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం కొడకండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు నిజజీవితంలో ఎప్పుడూ అవసరపడతాయని, ఎప్పుడూ రోడ్డుకు ఎడమవైపు నడవాలని, మెయిన్ రోడ్డు దాటే సమయంలో రెండు వైపులా వాహనాలు వస్తున్నాయా లేదా చూసుకొని దాటాలన్నారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో కూడా వాహనాలు నడపవద్దని తెలిపారు. కారణములేని మరణం ఒక రోడ్డు ప్రమాదం మాత్రమే అని, వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, ఉపాధ్యాయులు, ఏఎస్ఐ జగదీశ్వర్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ

**బెజ్జంకి, నవంబరు 22, ప్రభాతవార్త :** మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం పలు పథకాలతో తోడ్పాటును అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సత్యార్జున ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. మహిళా అభివృద్దే సర్కార్ అభివృద్ధి అనే రీతిలో ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు, గృహజ్యోతి,మహిళా రుణాలు, ఇందిరమ్మ ఇండ్లులాంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తు మహిళకు అండగా నిలుస్తుందన్నారు. అలాగే వివిధ గ్రామాలకు చెఉందిన 14 మంది మహిళలకు మహిళా సంఘాల నుంచి బీమా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డిపిఎం విద్యాసాగర్, తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపిడివో కడవెర్గు ప్రవీణ్, ఎపిఎం పర్శరాములు, ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, బైర సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, శానగొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

## వరికొయ్యలను కాలిస్తే భూమిని నష్టం..

**చిలిపిచెడ్, నవంబరు 22 ప్రభాతవార్త :** పంటను కోసిన తరువాత వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమికి నష్టం కల్గుతుందని ఏడిఏ పుణ్యవతి రైతులకి వివరించారు .శనివారం గౌతాపూర్ గ్రామంలో రైతు పొలాలను సందర్శించి రైతులకి వరి కోతలు అయన వెంటనే వరి కోయ్యలను కల్చకుండ వాటిని పొలంలోనే కలియ దున్నడం వలన రైతులకి ,భూమికి మరింత లాభం జర్గుతుందని వివరించారు .భూమికి మేలు చేసే వానపాములు ,సూక్ష్మ జీవులు చనిపోయి నష్టం కల్గుతుందని ,భూమి పై పొరలో ఉండే సేంద్రియం తగ్గిపోయి పంట దిగుబడి సైతం తగ్గిపోయే ప్రమాదముందని ,భూమి లో ఉండే సారం తగ్గిపోయి చౌడు భుమిగా మరే అవకాశం ఉంటుందన్నారు .దీని వల్ల వాయు కాలుష్యం మరియు శ్వాసకోశ వ్యాధులకి కారణమయ్యే హానికరమైన కాలుష్య కారకాలను విడుదల చేయడం ,నత్రజని భాస్వరం మరియు పొటాషియం వంటి విలువైన నెల పోషకాలు నాశనం చేయడం జర్గుతుందన్నరు కాల్చడం ద్వారా నెల నీటి నిలుపుదల మెరుగుపడే సేంద్రియ పదార్థం తొలగిపోతుందని అన్నారు.వరి కోయ్యలను కాల్చడం బదులు వరి పంట కోసిన తర్వాత పొలానికి నీలు పారించి ఎకరాకు 150 కిలోల సింగిల్ సూపర్ పోస్ఫేటే వేసి ,15 రోజుల తరువాత కలియ దున్నలన్నరు .కలియ దున్నడం వలన వరి గడ్డి అంత కుళ్లిపోయి సేంద్రియ కర్బానం స్థాయి పెరుగుతుందన్నారు .ఈ కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్ గౌడ్, ఏఈఓ కృష్ణవేణి ,రైతులు శేఖర్ , కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## పార్క్‌లో రూ.3.50 కోట్లతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు

### -అధికారులతో కలసి పనులను పరిశీలించిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, నవంబరు 22, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద ఉన్న గాంధీ బాలవిహార్ పార్క్‌లో 3.50కోట్ల రూపాయలతో కొనసాగుతున్న అభివృద్ధి పనులను శనివారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ జిహెచ్ఎంసి విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ అభివృద్దిపనులను త్వరగా పూర్తయ్యేలా చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. డిసెంబర్ మాసంలో గాంధీ బాలవిహార్ పార్క్‌ను మంత్రుల, మేయర్, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ డిఈ కృష్ణవేణి, విద్యుత్ ఏఈ లిఖిత, ఎస్ఎస్ కేశవులు, సిఎం మల్లేష్, శ్రీనివాస్ రాజు, గారెల శ్రీశైలం, బైకన్ నవీన్ యాదవ్, మాధవంరెడ్డి, కలీమ్, చారి, చాకలి నరసింహ, సాంభశివరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవు : ఎస్ఐ

**నర్సా పూర్, నవంబరు 22, ప్రభాతవార్త:** పట్టణంలోని జాతీయ 765 డి రహదారిపై బండ్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రంజిత్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నర్సా పూర్‌లోని రహదారిపై బండ్లపై పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని కలిశారు. ఈ రోడ్డుపై తోపుడు బండ్లు పెట్టడంవల్ల ట్రాఫిక్ ఇబ్బంది కలుగుతుందన్నారు ఈ సందర్భంగా ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు పక్కన పెట్టి పండ్ల వ్యాపారాలు చేస్తు రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురి వ్యాపారులను మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచడం జరిగిందని ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇకముందు ఎవరైనా పట్టణంలోని రహదారిపై బండ్లు పెట్టి ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

## సామూహిక వందేమాతరం గీతాలాపన

**కొమురవెల్లి,నవంబరు 22, ప్రభాతవార్త :** ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు వందేమాతరం 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సామూహిక వందేమాతరం గీతా ఆలపన చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు దండ్యాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బంకించంద్ర ఛటర్జీ చేతిలో పురుడోసుకున్న వందేమాతరం లక్షలాదిమంది దేశ భక్తులకు తారక మంత్రంలాగా పని చేసి స్వాతంత్ర్య సంగ్రామ మహోద్యమంలో ముందుండి పోరాడేలా స్ఫూర్తిగా నిలిచిందన్నారు. బిజెపి మండల అధ్యక్షులు స్వరూప తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


గ్యాస్ లీక్ అయిన సిలిండర్‌ను నర్సారెడ్డికి చూపుతున్న ప్రధానోపాధ్యాయురాలు

## పాఠశాలలో గ్యాస్ సిలిండర్ లీక్..తప్పిన ప్రమాదం

### -మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది

**గజ్వేల్, నవంబరు 22 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో గల ప్రైమరీ పాఠశాలలో ఉదయం విద్యార్థులకు అందించడానికి అంబలి తయారు చేస్తున్న సమయంలో గ్యాస్ సిలిండర్ లీక్ అయ్యి మంటలు రావడంతో వంట సిబ్బంది ఒక్కసారిగా భయంతో బయటకు పరుగులు తీశారు. మంటలు అధికంగా రావడంతో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విషయం తెలుసుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది పాఠశాల వద్దకు చేరుకొని ఎగిసిపడుతున్న మంటలను ఆర్పివేశారు. దీంతో అక్కడ ఉన్న విద్యార్థులు మంటలు ఎగిసిపడడంతో భయాందోళనకు గురయ్యారు. గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో అది పేలి ప్రమాదం జరుగుతుందని భయపడ్డారు. విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి పాఠశాలకు చేరుకొని గ్యాస్ ఎలా లీక్ అయ్యిందని వంట సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భారీ ప్రమాదం తప్పడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. ఏది ఏమైనా పాఠశాలలోని వంటగదిలో ఫైర్ సేఫ్టీ సిలిండర్‌ను ఏర్పాటు చేసుకోవాలని పలువురు సూచించారు. ఇలాంటి విషయంలో నిర్లక్ష్యం వహించరాదని మరోసారి ఇలాంటి సంఘటన జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత పాఠశాల సిబ్బందిపై ఉందని నర్సారెడ్డి సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, రేగొండగౌడ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, అజ్గర్, గాడిపల్లి శ్రీను, మన్నె అరుణ్, శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## మాలల రణభేరి సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**జహీరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మాలలకు విద్య, ఉద్యోగ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను పరిష్కరించుకునేందుకు ఈ నెల 23వ తారీఖున హైద్రాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే మాలల రణభేరి మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుషపల్లి జనార్ధన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ రోస్టర్ పాయింట్ 22ను కేటాయింపును పున పరిశీలించాలని, లేదా పునసమీక్షించి జీవో నంబరు 99ను సవరించి మాలలతో పాటు గ్రూప్-3లో ఉన్న మరో 26 కులాలకు న్యాయం చేయాలని, తెలంగాణలో ఉన్న 40లక్షల మంది మాలలు, వారి హక్కుల కొరకు మాల బిడ్డల భవిష్యత్తు కోసం జరిగే పోరాటంలో ప్రతి మాల సోదరులు పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, నాయకులు బక్కన్న, బి మల్లేశం, మహన్‌రాజ్, జహీరాబాద్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ అధ్యక్షులు బి మొగులయ్య గౌతం, ఉపాధ్యాయులు రామ్‌చందర్ భీంవంశీ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు డి శ్రీనివాస్, పి బుచ్చయ్య, బి అశోక్, బి బాలయ్య, పైడి గుమ్మల్ నర్సింలు, నర్సింలు, రామ్‌తీర్థ నేరుడు నరసింహులు, రజనీకాంత్, ఆకాష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## కేర్ టేకర్ పదవికి దరఖాస్తులు ఆహ్వానం

**నాగల్‌గిద్ద, నవంబరు 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మోర్గి గ్రామంలోని బాలికల వసతి గృహంలో కేర్ టేకర్‌గా సేవలు అందించేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ధరఖాస్తులు చేసుకోవాలని కేజీబివి అధికారిణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ, బిఎడ్, డిఎడ్ చేసిన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. కంప్యూటర్ నాలెడ్జ్, పనిపై అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ధరఖాస్తులను ఈ నెల 23వ తారీఖు నుంచి 25వ తేదీలోపు మోర్గిలోని బాలికల వసతి గృహంలో అందచేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 9705197687ను సంప్రదించాలని అధికారి సూచించారు.

## కండక్టర్ లేకుండా బస్సుల్లో మహిళలకు ఉచిత టికెట్

### విద్యార్థిని కీర్తన రూపొందించిన ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్

### రాష్ట్రస్థాయి ఇన్‌స్పైయిర్‌కు ఎంపిక

**కొండపాక, నవంబర్ 22, ప్రభాతవార్త :** కొండపాక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కీర్తన రూపొందించిన ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి ఇన్స్‌పెయిర్‌కు 2025కు ఎంపికైనట్లు అ విద్యార్థిని గైడ్ కె. రామస్వామి తెలిపారు. ఆర్టీసి బస్సుల్లో కండక్టర్ లేకుండానే మహిళలు అధార్ కార్డ్‌తో ఉచిత ప్రయాణ టికెటన పొందగల నూతన అవిష్కరణతో ఒ పరికరాన్ని గైడ్ కె. రామస్వామి మార్గదర్శకత్వంలో అమె కనుగొన్నారు. గత రెండు రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి ఇన్స్‌పెయిర్ ప్రదర్శనలో ఈ ప్రాజెక్ట్ ప్రేక్షకులను అకట్టుకుంది. బస్సులో ప్రయాణించే మహిళలు తమ అధార్‌కార్డును స్కానర్‌పై ఉంచితే డిస్‌ప్లే పై కనిపించే స్టేజి నంబర్‌ను ఎంటర్ చేసిన వెంటనే ఉచిత ప్రయాణ టికెట్ వస్తుందని తెలిపారు. ఒకసారి టికెట్ తీసుకున్న తర్వాత తిరిగి మూడు గంటల వరకు అదే అధార్‌పై మారో బస్సు టికెట్ రాకుండా నిరోధించే వ్యవస్థ ఈ పరికరంలో ఉండడంవల్ల ప్రభుత్వ ధనం వృధా కాకుండా కాపాడవచ్చునన్నారు. వన్ మెన్ సర్వీస్ బస్సులో డ్రైవర్‌కు ఇబ్బంది కలుగకుండా ఈ పరికరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం ఈ సాంకేతికతను అర్టీసి బస్సులో ప్రవేశపెడితే ఖర్చు తగ్గడంతపాటు సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని ఈ ప్రాజెక్ట్‌ను తయారు చేసిన విద్యార్థి కీర్తన తెలిపారు. ఈ ప్రతిభవంతమైన అవిష్కరణను చేసినందుకు విద్యార్థి కీర్తనను, గైడ్ ఉపాధ్యాయుడు రామస్వామిని ఎంఈఒ పురుమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం విఠల్ నాయక్, అధ్యాపక బృందం అభినందించారు.

## సంగారెడ్డిలో పోలీసుల వీక్లి పెరేడ్

**సంగారెడ్డి టౌన్, నవంబరు 22, ప్రభాతవార్త:**

ఆరోగ్య పరిరక్షణలో భాగంగా శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పోలిస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆర్మూడ్ రిజర్వ్ పోలీసులతో వీక్లి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్ మాట్లాడుతూ పోలీసులు ఫిజికల్ ఫిట్నెస్ చాల ముఖ్యమని, శారీరకంగా, మానసికంగా ఫిట్ ఉంటేఏ ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొంటామని గుర్తు చేశారు. జిల్లా ఆర్మూడ్ సిబ్బందితో పాటు సివిల్ సిబ్బందికి వీక్లి పరేడ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నిత్యం యోగా, వ్యాయామం చేస్తూ ఫిజికల్‌గా ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తమ పోలీసు ఠాణా పరిధిలో గల హిస్టరీ షీటర్ల గురించి పూర్తి అవగాహన కల్గి ఉండాలని, వారిపై నిఘా ఉంచాలని, విలేజ్ విసిటింగ్‌లో భాగంగా ఆస్తి సంబంధిత సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్స్, ట్రాఫిక్ రూల్స్,రోడ్డు ప్రమాదాల గురించి ప్రజలలో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వార అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండాలన్నారు. సిబ్బంది వ్యక్తి గత సమస్యలతో పాటు విధి నిర్వాహణలో ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలై కుటుంబాలు పాలు కాకుండా చూసుకోవాలన్నారు. వీక్లి పరేడ్‌లో ఆర్ఐలు శ్రీనివాస్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, డానియేల్, ఆర్ఎస్ఐలు, డ్రిల్ ఇన్స్‌పెక్టర్లు,సిబ్బంది పాల్గొన్నారు.


సంగారెడ్డిలో వీక్లీ పెరేడ్ చేస్తున్న పోలీసులు

# మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**చేర్యాల, నవంబరు 22,ప్రభాతవార్త**

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.శనివారం చేర్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ ప్రభుత్వం మహిళా ఉన్నతి,తెలంగాణ ప్రగతి ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఎంపి చామలతో పాటు జనగామ ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి,జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు.జ్యోతి ప్రజ్వలన చేసి తెలంగాణ గేయాలపన అనంతరం ఇటీవలే పరమావధించిన తెలంగాణ జాతీయ గీతాన్ని రచించిన మద్దూరు మండలం రేబర్తి గ్రామానికి చెందిన అందెశ్రీని స్మరిస్తూ నిమిషం పాటు మౌనం పాటించారు.అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్య ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమం విశిష్టత మహిళ శక్తి ద్వారా మహిళలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, మద్దూరు,కొమురవెల్లి,దూళిమిట్ట మండలాలకు 22340 చీరలు పంపిణీ చేయనున్నామని తెలిపారు.అలాగే 119 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ... ప్రజల సమస్యలు పరిష్కరిస్తే ప్రజలు మనల్ని దీవిస్తారని,మహిళలు చాలా శక్తి వంతులు,వారికి బాధ్యతలు చాలా ఎక్కువని ఆయన అన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరాలులను చేయలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి మహిళా శక్తి ద్వారా క్యాంటీన్,ఐ కె పి సెంటర్,బస్సులు, ఇతరత్ర పథకాలను చేపట్టారని తెలిపారు. మీరు ఆర్థికంగా బలవంతులు ఐతే రాష్ట్రం కూడా ఆర్థిక పురోబివృద్ధి సాధిస్తుందని ముఖ్యమంత్రి బలంగా నమ్ముతారు. సన్నబియ్యం, 200 యూనిట్ ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు మేలు చేసేవేనన్నారు.మహిళలకు ఎన్ని కోరికలు ఉన్నా కూడా ఆర్థిక పరిస్థితిలు చూసుకుంటూ ఒక్కొక్కటిగా నెరవేర్చుకోవాలని తెలిపారు.ఆసుపత్రి ప్రారంభించుకున్నాం. ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ మంజూరు కావాలని స్థానికులు చాలా మంది అడుగుతున్నారు. డయాలసిస్ కోసం సిద్దిపేటకి వెళ్లకుండా ఇక్కడే ఆసుపత్రిలో డయాలసిస్ పెట్టెల చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కి తెలిపారు. ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ, జిల్లాలో మహిళా సంఘాలు బ్రహ్మాండంగా పని చేస్తున్నాయి. ఐకెపి కేంద్రాల్లో కొనుగోలు కూడా అద్భుతమైన రీతిలో నడిపిస్తున్నారు.ఇందిరమ్మ ఇళ్లకు మొదటి విడత డబ్బులు పడేవరకు మహిళా సంఘాల నుండి చేయూత అందించడం జరిగిందన్నారు.చాకలి ఐలమ్మ పుట్టిన ప్రాంతం, రాణి రుద్రమ్మ వారసుల మీరంతా పనిచెయ్యడంలో వెనకాడని మహిళలన్నారు. మహిళా సంఘాలకు కాకుండా వైట్ రేషన్ కార్డు కలిగిన మహిళకు ఇవ్వడం మంచి పరిణామం అని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ రోజే ఆసుపత్రి ప్రారంభించడంలో కలెక్టర్ కీలక పాత్ర పోషించినందుకు అభినందనలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...మహిళలు అంటేనే ఒక శక్తి అని వాళ్ళ శక్తి వారికి తెలీదు.పూర్వం నుండి ఎవరో ఒకరు చెప్పింది చేయడమే,మహిళలే ఏదైనా చేయగలుగుతారు అని పొదుపు సంఘాలలో చేరి ఉద్యోగాలు,వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. మహిళలు వర్తక వ్యాపార రంగంలో ఉన్నతంగా ఆలోచించి ధైర్యంగా నిలబడాలని సూచించారు. కుటుంబానికి చూసుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు.



చీరలు పంపిణీని చేస్తున్న ఎంపి,ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్